

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 102 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 13, మార్చి 2026 | పేజీలు 9 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్







# బలవంతపు అధికారం.. బరితెగిస్తుంది !





● దేశంలో "పెరిగిపోతున్న" పేదరికం ● బిజెపి దేశాన్ని నాశనం చేస్తుంది ● దేశంలో దరిద్రం దాపురించింది ● నీతి లేదు జాతి లేదు ఎవ్వడైనా దోసుకునుడుకు మరిగాడు ● పోద్దంతా కొట్లాటలు రాత్రంతా సన్నిహిత సంబంధాలు ● ఏ పార్టీలో ఉన్న పైసల సంపాదన వ్యాపారులందరు కలిసి పోతున్నారు ● దేశానికి పట్టిన దరిద్రం పోయేదెలా ● మోసగాళ్లంతా రాటు తేలిపోతున్నారు సామాన్యులు వేదనపడుతున్నారు ● 2000 రూపాయల నోటు ఏమైనట్టు....ఉన్నట్టా మాయమైనట్టా.. ● రైతులను హరిగోస పెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ● డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

బిజెపి పాలనలో పేదలకు బువ్వ దొరకడం కష్టతరంగా మారిపోయిందని డాక్టర్ బరిగెల శివ వాక్యానించారు.జాతీయ ఎన్నికల కమిషన్ రూటు మారుస్తుం డడంతో బిజెపి ప్రభుత్వం బలవంతపు గెలుపుకు సునాయాస మార్గాలు తయారు చేయబడుతున్నాయని అది భారత రాజ్యాంగ నిర్మాణ నియమాలకు, సుప్రీం కోర్ట్ నియ మాలకు పూర్తి విరుద్ధమని గుర్తు చేశారు.జాతీయ ఎన్నికల కమిషన్ చేతిలో పెట్టుకొని దేశాన్ని శాసిస్తున్న తీరు ఎన్నికల నిర్వహణ పట్ల ప్రపంచ స్థాయిలో క్షేత్రస్థాయి అనుమానాలతో కూడిన అభియోగాలు ఆధార రూపంలో బయటపడుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చింతైనా మారకపోవడం పైగా జాతీయ ఎన్నికల కమిషన్ను అదే పనిగా ఉపయోగించుకోవడం దేశానికి తీవ్ర నష్టాన్ని చేకూరుస్తుందని వివరించారు.జాతీయ ఎన్నికల కమిషన్ పూర్తిస్థాయిలో అధికార బలాన్ని ఉపయోగిస్తూ అన్ని రాష్ట్రాలలో బిజెపి ప్రభుత్వాన్ని బలవంతంగా బలపరుస్తూ గెలిపిస్తూ అధికారంలోనికి తీసుకురావడానికి అన్ని రకాలుగా సహకరిస్తున్నట్లుగా దేశవ్యాప్తంగా విపరీతమైన ఉద్యమాలు పెరిగిపోతున్నాయన్నారు.బలవంతంగా అధికారాన్ని లాక్కుంటున్న

- మిగతా 2లో..

## నేడు కేయుకు తీన్మార్ మల్లన్న రాక

విద్యాపరమైన సమస్యలపై సుదీర్ఘ చర్చ జరగనుందా?

పార్ట్ టైం అధ్యాపకుల కన్నీరు తుడిచేది ఎప్పుడు

తూతూ మంత్రంగా సమావేశం జరగనుందా....

ఈ చర్చా వేదిక ద్వారా విశ్వవిద్యాలయానికి లాభం జరగనుందా....

గత 20 సంవత్సరాలుగా కేయూ ఆస్తులను,భూములను కబ్జా చేస్తున్న కబ్జాదారులకు శిక్ష పడేనా

నిజాయితీ కలిగిన ఆచార్యులు, అధికారులు, విద్యార్థులపై మానసిక భౌతిక దాడులేంది.

గతంలోని పర్యటనలను తలపిస్తుందా ప్రత్యేకతను సంతరించుకుంటుందా?

విద్యార్థులపై కేసులు పెట్టే హక్కు అవినీతి అక్రమార్కులకు ఉందా!

కాంగ్రెస్ పాలనలో కూడా కేయూలో ఆర్ఎస్ఎస్ అధికార ఆగడాలు ఏంది?

కేయూలో అవినీతి దోపిడీకి హద్దులు లేకుండా పోతున్నాయి

విశ్వవిద్యాలయాన్ని రక్షిస్తారా ?మూసివేస్తారా?

9



## 10 మంది ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్..

పార్టీ ఫిరాయింపు కేసును ముగించిన సుప్రీంకోర్టు

తెలంగాణలో ఉత్కంఠ రేపిన పార్టీ ఫిరాయింపుల వ్యవహారం

అన్ని పిటిషన్లను స్పీకర్ పరిష్కరించారన్న న్యాయవాది అభిషేక్ సింఘ్వీ

స్పీకర్ నిర్ణయం నేపథ్యంలో విచారణ ముగిసిందని ప్రకటించిన సుప్రీంకోర్టు



7

## అంతర్గత రిజర్వేషన్ అమలును అడ్డుకుంటున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

మందకృష్ణ మాదిగ ఆరోపణ

5

## కుటుంబానికి కవచంలా నిలిచే నిస్వార్థ ప్రేమ నాన్న

బిడ్డల భవిష్యత్తు కోసం

త్యాగమయ జీవితం గడిపేది తండ్రి

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

డా.బరిగెల శివ

2





## ఎంజీఎంలో ఏం జరుగుతుంది?

ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కు... కానీ పేదలకు నరకయాతన?

ఎంజీఎం ఆసుపత్రి అవ్యవస్థలపై సంచలన దర్యాప్తు

పరీక్షల కోసం బయటికి పరుగులు...

డాక్టర్ల కోసం గంటల వేచి చూపులు - లిఎంజీఎం లో రోగుల అవస్థలు

ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రైవేట్ క్లినిక్‌లకు రోగుల మళ్లింపు?

ఎంజీఎం పై తీవ్రమైన ఆరోపణలు.. పోస్టుమార్టంలో డబ్బుల వేట?

ఎంజీఎం ఆసుపత్రి చుట్టూ కలకలం

వేలాది రోగులు... కానీ బెడ్లు లేవు, సదుపాయాలు లేవు - ఎంజీఎం దుస్థితి బయటపడింది.. ఉచిత వైద్యం ఎక్కడ?

పరీక్షల కోసం పేదలు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలు

ఎంజీఎం ఆసుపత్రి వద్ద అంబులెన్స్ దందా? అత్యవసరంలోనే భారీ చార్జీలు

77 మంది డాక్టర్లకు మెమోలు ఇచ్చినా మారని పరిస్థితులు - ఎంజీఎం పై ప్రశ్నలు

ఉత్తర తెలంగాణ ప్రజల ఆశ్రయం... కానీ అవినీతి ఆరోపణల ముసుగులో ఎంజీఎం?

ఎంజీఎంలోని ప్రతి విభాగముపై ప్రత్యేక కథనాలు అతి త్వరలో

3

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

## విధి నిర్వహణతో పాటు ఉన్నత విద్య

**పీహెచ్‌డీ సాధించిన అడిషనల్ ఎస్పీ డాక్టర్ బోనాల కిషన్‌కు ఘన సన్మానం**



**వరంగల్, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

వృత్తి బాధ్యతలు ఎంత ఉన్నా చదువుపై ఆసక్తి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డాక్టర్ బోనాల కిషన్ తన కృషితో నిరూపించారని అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ కొనియాడారు. కాకతీయ యూనివర్సిటీ లా విభాగం నుండి డాక్టర్ బోనాల కిషన్ పీహెచ్‌డీ పట్టా పొందిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. 1995లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీస్ శాఖలో సేవలు ప్రారంభించిన బోనాల కిషన్ గారు విధి నిర్వహణలో ఉండగానే చదువుపై ప్రత్యేక ఆసక్తి చూపుతూ చట్టాలపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని సంకల్పించారు. ఈ క్రమంలో ఎల్‌ఎల్‌బీ చదివి పూర్తి చేసి న్యాయ విద్యలో ప్రావీణ్యం సాధించారు. అనంతరం 2006లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందినా చదువుపై మక్కువ తగ్గకుండా ఎల్‌ఎల్‌ఎమ్ కూడా పూర్తి చేశారు. తన విద్యాభ్యాసాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో 2018లో కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీకి అడ్మిషన్ తీసుకున్నారు. అప్పటికే పోలీస్ శాఖలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ చదువును కొనసాగిస్తూ చట్టాలకు సంబంధించిన అంశాలపై పరిశోధన చేపట్టారు. ఏసీపీగా విధులు నిర్వర్తిస్తూ పరిశోధన కొనసాగించిన ఆయన కృషి ఫలితంగా 2024లో అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందారు. విధి నిర్వహణతో పాటు పరిశోధనను కొనసాగించిన ఆయన తాజాగా 2026 ఫిబ్రవరిలో తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ, నిరంతరం పని ఒత్తిడితో ఉండే పోలీస్ శాఖలో సేవలు అందిస్తూ ఉన్నత విద్యను అభ్యసించడం నిజంగా అభినందనీయమని పేర్కొన్నారు. డాక్టర్ బోనాల కిషన్ సాధించిన ఈ విజయము యువతతో పాటు ఉద్యోగులకు కూడా స్ఫూర్తిదాయకమని అన్నారు. చదువుకోవడానికి వయస్సు, వృత్తి ఎలాంటి అడ్డంకి కాదని ఆయన తన కృషితో నిరూపించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోతరబోయిన అంకుస్, నలుబోల రాము, పులిచెరు భాస్కర్, వి. ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొని డాక్టర్ బోనాల కిషన్‌ను అభినందించారు.

## కుటుంబానికి కవచంలా నిలిచే నిస్వార్థ ప్రేమ నాన్న

**బిడ్డల భవిష్యత్తు కోసం త్యాగమయ జీవితం గడిపేది తండ్రి**

**జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్ డా.బరిగెల శివ**

**(హైదరాబాద్, జై భీమ్ న్యూస్)**



సభ్య సమాజంలో తల్లిదండ్రులకు తగిన గౌరవం ఇవ్వకుండా, వారి త్యాగాలను గుర్తించకుండా కొందరు వ్యవహరిస్తున్న పరిస్థితులపై జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్ బరిగెల శివ ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల విలువను గుర్తించి వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా బరిగెల శివ మాట్లాడుతూ, మనిషి జీవితంలో తల్లిదండ్రుల ప్రేమకు సమానమైనది మరొకటి లేదని అన్నారు. తల్లి నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిస్తే, ఆ బిడ్డ భవిష్యత్తు కోసం తన భుజాలపై బాధ్యతను మోసే మహనీయుడు తండ్రి అని పేర్కొన్నారు. తండ్రి మోసేది బరువును కాదు, బాధ్యతను అని ఆయన అభిప్రాయపడ్డారు. కుటుంబాన్ని నిలబెట్టే ధైర్యం, బిడ్డల భవిష్యత్తును నిర్మించే సంకల్పం, వారి సంతోషం కోసం తన జీవితాన్నే అర్పించే త్యాగం---అన్ని కలిసిన రూపమే నాన్న అని తెలిపారు. బిడ్డ పుట్టిన క్షణం నుంచే తండ్రి జీవితం మారిపోతుందని, ఆ చిన్నారి నవ్వు కోసం అతను ఎన్నో కష్టాలను భరిస్తాడని ఆయన అన్నారు. ఆడపిల్లను కంటికి రెప్పలా కాపాడుతూ గుండెలపై ఆడిస్తూ గుండెకు గూడుగా నిలిచే తండ్రి ప్రేమ ఎంతో గొప్పదని పేర్కొన్నారు. ఎండలో ఎండిపోతూ, వానలో తడుస్తూ, చలిలో వణుకుతూ అయినా తన బిడ్డకు ఏ చిన్న ఇబ్బంది రాకుండా కాపాడే కవచం తండ్రి అని చెప్పారు. బిడ్డ ఎక్కడైనా బాధపడుతుందేమోనని తన మనసులోని ఆందోళనను బయటకు చూపించకుండా మౌనంగా మోసే శక్తి తండ్రిదని, బిడ్డ అలిగితే క్షణాల్లో అలక తీర్చే ప్రేమ కూడా తండ్రిదేనని తెలిపారు. తన కష్టాలను మరిచి బిడ్డల నవ్వును చూసి ఆనందించే హృదయం తండ్రిదని అన్నారు. బిడ్డకు ఎండ తగలకూడదని పచ్చని చెట్టులా నీడనిస్తూ, వర్షం తడవకుండా గొడుగులా కాపాడుతూ ఆరుగాలం కష్టపడే వ్యక్తి తండ్రి అని ఆయన పేర్కొన్నారు. అలసటను లెక్కచేయకుండా, ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా బిడ్డల కోసం కలలు కంటూ జీవించే మహోన్నత వ్యక్తి నాన్న అని తెలిపారు. ఈ ప్రపంచంలో కల్తీ లేని నిజమైన ప్రేమ ఉంటే అది తండ్రి ప్రేమేనని ఆయన అన్నారు. తండ్రి ప్రేమలో మాతృత్వపు మాధుర్యం కూడా దాగి ఉంటుందని, బిడ్డల పాదాలు నొప్పిపెట్టకూడదని మెత్తని చెప్పులు కొనిచ్చే మనసు తండ్రిదేనని పేర్కొన్నారు. తాను ఏమీ ఆశించకుండా బిడ్డల సుఖసంతోషాలే తన ఆశగా భావించే వ్యక్తి తండ్రి అని చెప్పారు. బిడ్డల భవిష్యత్తు కోసం తండ్రి చేసే త్యాగాలకు లెక్కలేదని, ముఖ్యంగా ఆడపిల్ల జీవితానికి మంచి వరుడిని వెతుకుతూ విశ్వం అంతా గాలించేంతగా ప్రయత్నిస్తాడని తెలిపారు. బిడ్డల సుఖం కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తూ, తన పరువు, ప్రతిష్ఠ, కష్టం, సుఖం అన్నిటినీ బిడ్డల కోసమే అర్పించే నిస్వార్థ శ్రామికుడు తండ్రి అని కొనియాడారు. సమాజంలో బిడ్డల గౌరవం, హోదా విషయంలో ఎలాంటి రాజీ పడని ధైర్యం తండ్రిలో ఉంటుందని ఆయన అన్నారు. నిజానికి నిలువుటద్దం నాన్న, గాంభీర్యానికి ప్రతీక నాన్న, ఔదార్యానికి చిహ్నం నాన్న, త్యాగానికి నిర్వచనం నాన్న, కుటుంబాన్ని కాపాడే కవచం కూడా నాన్నేనని బరిగెల శివ పేర్కొన్నారు. అందుకే తండ్రి ప్రేమకు, ఆయన త్యాగాలకు ప్రపంచంలో ఎలాంటి కొలమానం లేదని, కుటుంబాన్ని నిలబెట్టే ఆ మహోన్నతమైన వ్యక్తి నాన్న అని ఆయన అన్నారు.

# బలవంతపు "అధికారం" బరితెగిస్తుంది

మొదటి పేజీ తరువాయి

బిజెపిని చూసి దేశ ప్రజలు లక్షల సంఖ్యలో,కోట్ల సంఖ్యలో రోడ్లపైకి వచ్చి ధర్నాలు నిర్వహిస్తూ ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని పోరాటాలు చేస్తున్నారని గుర్తు చేశారు.రాజ్యాంగపరమైన విలువలను రక్షించడానికి సుప్రీంకోర్టు న్యాయస్థానాన్ని సైతం చేతులు కట్టేసినట్టుగా బిజెపి అధికారం దినదినం పెరిగిపోతుండడం దేశ పరిస్థితులు దేశ ఉనికి దేశ ఆర్థికమాన్యం ఏమైపోతుందోనని దేశ ప్రజలు ఆందోళన చెందుతున్నారని గుర్తు చేశారు.ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా బ్రతికున్న వ్యక్తులను చనిపోయినట్లుగా చిత్రీకరిస్తూ ఓటర్ లిస్ట్ లో చూపిస్తుండడం ఏదైతే ఉందో అది దేశానికి అత్యంత ప్రమాదకరమన్నారు.దేశవ్యాప్తంగా బ్యాలెట్ ఎన్నికలు నిర్వహించబడాలని అనేక రకాల పోరాటాలు ఉద్యమాలు జరుగుతున్నాయన్నారు.ఇదంతా కేవలం బిజెపి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని గమనిస్తున్న దేశ ప్రజలు బిజెపి నుండి ఎలాగైనా భారతదేశాన్ని రక్షించుకోవాలని అన్ని రకాల తాపత్రయాలతో కూడిన ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.దేశవ్యాప్తంగా మతం మారితే కులం పోతుందని పదేపదే సామాన్య ప్రజల్ని భయపెట్టించే ప్రభుత్వాలు న్యాయస్థానాలు కేంద్ర ప్రభుత్వ నాయకులు పార్టీ మారితే పదవులు పోతాయనే సాంకేతాలను దేశవ్యాప్తంగా ఎందుకు ప్రబలించలేకపోతున్నారని తీవ్రంగా హెచ్చరించారు.అత్యున్నత మైన న్యాయస్థానం దేశవ్యాప్తంగా అన్ని పార్టీలలోకి వెళ్లి పార్టీలు మారుతున్న నాయకుల పట్ల ఎందుకు కఠినంగా వ్యవహరించడం లేదంటూ అడిగారు.చేతకాని వెధవలంతా రాజకీయ స్వార్థపు బుద్ధితో అభివృద్ధి అనే పదాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడమే కాకుండా హద్దులు దాటి అదుపుతప్పి పార్టీలు మారుతూ మానవత్వాన్ని సంపుకొని ప్రజల ఉసురు పోసుకుంటున్నారని ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనను చంపుకొని వ్యక్తిగత స్వార్థపు దుర్బుద్ధి అవృద్ధిని పెంపొందించుకుంటున్నారని తీవ్రంగా హెచ్చరించారు.దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో మీడియా సంస్థలను నిర్మించుకున్న బిజెపి మీడియా ముసుగులో దేశాన్ని శాసిస్తుందని ఎక్కడ చూసినా తప్పుడు సంకేతాలను దేశవ్యాప్తంగా ప్రభళిస్తుందని గుర్తు చేశారు.వేల సంఖ్యలో సోషల్ మీడియా దారులు దేశ నాశనానికి సహకరిస్తున్నట్లుగా బిజెపి అరాచకాలను అభివృద్ధి ఫలాలుగా చూపిస్తుండడం భయంకరమైన మోసం లాంటిది అన్నారు.బిజెపి పాలనలో పేదోళ్లకు బువ్వ దొరకడం లేదన్నది పచ్చి వాస్తవమన్నారు.2000 రూపాయల నోట్లను ప్రవేశపెట్టిన బిజెపి దానిని ఎందుకు కనుమరుగు చేసిందో ఇప్పటికీ చెప్పలేకపోతున్నారని అసలు కైతే ఆ "నోటు" ఉన్నట్లు లేనట్లు ఏమీ తోచడం లేదన్నారు.సమస్యలను సృష్టించడంలో బీజేపీని మించిన పార్టీ లేదని ప్రజలను వేధించడంలో బిజెపికి తిరుగు లేదని, సాటి లేదని వివరించారు.దేశ ప్రజలపై పన్నుల భారాన్ని వేస్తూ కాలానుకూలంగా ఒక్కొక్క నిత్యవసరానికి చెందిన వస్తువులను లోటుగా చూపిస్తూ భయంకరమైన రేట్లను పెంచుతూ ప్రజల నడ్డి విరగొడుతున్నారని తీవ్రంగా హెచ్చరించారు.ప్రస్తుతం దేశంలో గ్యాస్ సిలిండర్ల సమస్య పథకానికి చేరిపోయిందని అలాంటి సందర్భాల్లో దేశ ప్రధాని హోం శాఖ మంత్రి విదేశాలకు, టూరిస్టులలాగా ప్రవర్తిస్తూ పరిమితమైపోయి ధనికులపై తప్ప పేదలపై ప్రేమ చూపించడం లేదని సూటిగా గుర్తుకు చేశారు .రైతులను నలుమూలల వేధింపులకు గురి చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 13 సంవత్సరాల కాలంలో లక్షల సంఖ్యల్లో రైతులను ఆత్మహత్యలు చేసుకునే విధంగా ప్రేరేపించారని రైతు చట్టాలను రక్షించడం కోసం జరిగిన పోరాటాల్లో జాతీయ స్థాయి ఉద్యమకారులను జైల్లో పెడుతూ రేపిస్టులను, సంఘవిద్రోహశక్తులను సమాజ ఉద్యమ ద్రోహులను రక్షించడం కోసం వాళ్లకు స్వేచ్ఛ హక్కులు కల్పిస్తూ ఉన్నత అత్యున్నత న్యాయస్థానాలను లెక్కచేయకుండా అలాంటి వాళ్ళ రక్షణ కోసం రాజకీయ అధికార పదవులను ఉపయోగిస్తున్నారని సూటిగా నిలదీశారు.పైగా అన్ని రాష్ట్రాలలోని ఆర్థిక వనరులను దోచుకుంటున్నారని వెల్లడించారు.కార్మికులను హరిగోశ పెడుతున్న కేంద్ర ప్రభుత్వం హిందూ దేవాలయాలను కూల్చివేస్తూ అడవుల సిరి సంపద వనరులను దోచుకుంటూ ప్రభుత్వ సన్నిహితులతో వ్యాపారాలు చేయిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.పేదవాళ్ల ఉసురు పోసుకుంటూ పన్నుల రూపంలో పేద ప్రజలపై అన్ని రకాల భారాలను వేస్తున్నారని వాటన్నిటిని రాష్ట్ర ప్రభుత్వాలు పక్కాగా అమలుపరుస్తూ పేద ప్రజల జీవన విధానాన్ని నీరు కార్చే విధంగా శాసిస్తున్నారని గుర్తు చేశారు.ప్రభుత్వ సంస్థలను కాలరాస్తుండడమే కాకుండా ప్రైవేట్ రంగాలను దోచుకోవడంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం తమ సన్నిహిత వర్గాలను ప్రైవేటు రంగాల పైకి ఉసిగొలుపుతుండడం దేశ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.దైవభక్తి పేరుమీద అన్ని రాష్ట్రాలలో ఉగ్రవాదులు లాంటి వ్యక్తులను తయారు చేస్తూ చట్టాలతో న్యాయస్థానాలతో సంబంధం లేకుండా ప్రజల ప్రాణాలను తీయిస్తున్నారని బిజెపికి చెందిన వాళ్ళు ఎంతటి నేరాలు-ఘోరాలు చేసిన ఎంతటి మర్డర్లు మానభంగాలు చేసిన ఎంతటి రేపులు చేసిన కేసులు లేకుండా పోవడం ప్రజాస్వామ్య దేశం పతనం కావడమేనన్నారు.బిజెపిని ప్రశ్నించకూడదు న్యాయం చేయమని అడగకూడదు అనే భావన దేశవ్యాప్తంగా బలవంత పరచుటకు అన్ని రాష్ట్రాల్లో అరాచక శక్తులు మతం ముసుగులో మర్డర్లు మానభంగాలు దాడులు అరాచకాలు విధ్వంశాలు సృష్టిస్తున్నారన్నది పచ్చి నిజమన్నారు.ముస్లింలపై కుట్రలు క్రైస్తవులపై దాడులు దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని పైగా అలాంటి దాడులకు పాల్పడుతున్న వ్యక్తులకు ప్రభుత్వం అండదండలు కల్పిస్తూ సోషల్ మీడియాతో పాటు జాతీయ మీడియాలలో వాళ్ళపై ప్రశంసల వర్షం కురిపిస్తుండడం ఏంటని ప్రశ్నించారు.అధికార పదవిని అడ్డం పెట్టుకొని అవినీతిపరులతో రాష్ట్రాలను దోచుకోవాలనే సాహసవంతమైన ప్రయోగాలను కేంద్ర ప్రభుత్వం చేస్తుండడం అన్ని రాష్ట్రాల్లోని నాయకులు కేంద్ర ప్రభుత్వం పరిపాలనకు బానిసల్లాగా తయారవుతున్నారే తప్ప ఆయా రాష్ట్రాలను స్వయం పరిపాలనలో కాపాడుకోలేకపోతున్నారని ఎద్దేవ చేశారు.దేశంలో 90 శాతం రాజకీయ నాయకులలో ఎవ్వని దగ్గర నీతి లేదని అందరూ అవినీతి ముసుగులో అక్రమాల ముసుగులో బ్రోకర్ సంస్థలను స్థాపించుకుంటున్నారని తీవ్రంగా మందలించారు.దేశాన్ని భ్రష్టు పట్టించడం కోసం మోసగాళ్లంతా రాటు తేలిపోతున్నారని తీవ్రంగా హెచ్చరించారు.దేశాన్ని కాపాడుకోవాలనే సదుద్దేశం కలిగిన నాయకులు పార్లమెంటు సమావేశాల్లో ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ దడదడలాడిస్తున్నారని అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ వైఖరి మాత్రం కాస్తయినా మారకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.దేశానికి పట్టిన దరిద్రం బ్యాలెట్ ఎన్నికల నిర్వహిస్తే తప్ప పోదనేది స్పష్టంగా వెల్లడించబడుతుందని దేశ ప్రజలందరూ బ్యాలెట్ ఎన్నికల వైపు మొగ్గుచూపుతుండగా జాతీయ ఎన్నికల కమిషన్ జాతీయ అత్యున్నత న్యాయస్థానం దేశ ప్రజల ఆత్మగౌరవానికి పునాదులు వేస్తాయా కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా మారి దేశ ప్రజల మానప్రాణాలను ఆర్థిక మాన్యాలను ఆత్మ గౌరవాలను నీరు కారుస్థాయా లేచి చూడాలన్నారు.



## చైతన్యంతోనే వినియోగదారుల మోసాలను అరికట్టవచ్చు

**ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పిలుపు**




**హన్మకొండ, 12 మార్చి 2026 (జై భీమ్ న్యూస్)**

వినియోగదారులు చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే మోసపూరిత వ్యాపారాలను అరికట్టగలమని హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయ్ పేర్కొన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధ్యక్షుడు డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ రచించిన లి"వినియోగదారుల హక్కుల చైతన్య కరపత్రిక"లిను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ గత నాలుగు దశాబ్దాలుగా వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. సమాజంలో వినియోగదారులు ఎదుర్కొనే మోసాలు, కల్తీ ఉత్పత్తులు, తప్పుడు ప్రకటనలు, ఆన్లైన్ కొనుగోళ్లలో జరిగే మోసాల నుంచి ప్రజలు ఎలా రక్షించుకోవాలో ఈ కరపత్రంలో సవివరంగా వివరించారని చెప్పారు. ప్రత్యేకంగా వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం -- 2009లో ఉన్న నిబంధనల గురించి ఇందులో వివరించారని తెలిపారు. తప్పుడు లేదా మోసపూరిత ప్రకటనలు చేస్తే వాటిలో పాల్గొనే సెలబ్రిటీలకు కూడా జరిమానా లేదా జైలు శిక్ష విధించే నిబంధనలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. వినియోగదారులు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకొని చట్టపరమైన మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు. ఇక 78 సంవత్సరాల వయసులో కూడా డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ సమాజంలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందించడం ప్రశంసనీయమని కలెక్టర్ అభినందించారు. ప్రతి వినియోగదారుడు చట్టంపై అవగాహన పెంపొందించుకొని తన హక్కులను కాపాడుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వరంగల్ జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి, స్టేట్ కన్స్యూమర్ క్లబ్స్ కోఆర్డినేటర్ కొడిమాల శ్రీనివాసరావు, విజిలెన్స్ కమిటీ సభ్యుడు బండ కాళిదాస్, కన్స్యూమర్ కార్యకర్త డాక్టర్ జగదీష్ ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మందమర్రి చెరువు ఆక్రమణలపై ఆందోళన

**చర్యలు తీసుకోవాలని మాది హక్కుల దండోరా డిమాండ్**



**మందమర్రి, 12 మార్చి 2026 (జై భీమ్ న్యూస్)**

మందమర్రి రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న చెరువు ఆక్రమణలకు గురవుతున్నదని స్థానికులు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువు నీరు పరివాహక ప్రాంతం వరకు చేరుకోవడంతో చెరువు అసలు పరిధి ఎంత ఉందో స్పష్టంగా బయటపడిందని వారు పేర్కొన్నారు. వర్షాకాలంలో చెరువు పరివాహక ప్రాంతం ఎంత విస్తరించిందో ఇప్పుడు ప్రజలకు తెలుస్తోందని తెలిపారు. ప్రజలందరికీ ఉపయోగపడాల్సిన ఈ చెరువును వాకింగ్ ట్రాక్ పేరుతో ఆక్రమించి క్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. చెరువుకు సంబంధించి ఉండాల్సిన బఫర్ జోన్‌ను పూర్తిగా పట్టించుకోకుండా చెరువు భూముల్లోనే కట్టడాలు నిర్మిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. సర్వే నంబర్లు 101, 102, 103, 104 భూములు కొనుగోలు చేశామని చెప్పినా వాస్తవానికి పక్కనే ఉన్న సర్వే నంబర్ 100లోని చెరువు భూమిలోనే నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా చెరువు భూములను ఆక్రమించిన వారే ప్రస్తుతం నాయకులుగా మారి, అధికారంలో ఉన్నవారితో కలిసి తిరుగుతూ ప్రభావం చూపుతున్నారని స్థానికులు అంటున్నారు. ప్రజలందరికీ ఉపయోగపడాల్సిన చెరువులు క్రమంగా ఆక్రమణలకు గురవుతుండగా స్పందించాల్సిన సంబంధిత శాఖలు మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ కమిటీ ఈ విషయంలో ఏమి చర్యలు తీసుకుంటోందో తెలియడం లేదని ప్రశ్నిస్తున్నారు. చెరువు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు, వ్యవసాయం వంటి కార్యకలాపాలు ఎలా అనుమతిస్తున్నారని, ఇండ్లకు పర్మిషన్‌లు ఇవ్వడం, విద్యుత్ కనెక్షన్లు, రోడ్లు, కాలువలు నిర్మించడం వంటి చర్యలు ఆక్రమణదారులకు సహకరించడం కాదా అని వారు ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో 1/70 చట్టంను అడ్డంకిగా చూపుతుంటే, చెరువుల ఆక్రమణల విషయంలో మాత్రం చట్టం ఎందుకు అమలు చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ ఆక్రమణలపై ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చెరువులను రక్షించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. కార్మిక గనులు, ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి వెంటనే స్పందించి మందమర్రి చెరువులపై జరుగుతున్న ఆక్రమణలను అరికట్టాలని, ప్రజలకు చెందిన నీటి వనరులను రక్షించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మలిదశ తెలంగాణ ఉద్యమకారులు -- మాది హక్కుల దండోరా మందమర్రి పట్టణ కమిటీ కన్వీనర్ కోలు గురి విజయ్ కుమార్ ప్రభుత్వాన్ని కోరుతూ చెరువుల ఆక్రమణలను వెంటనే తొలగించి ప్రజల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు.

# ఎంజీఎంలో ఏం జరుగుతుంది?

**ఉత్తర తెలంగాణకు పెద్దదిక్కు... కానీ పేదలకు నరకయాతన?**
**ఎంజీఎం ఆసుపత్రి అవ్యవస్థలపై సంచలన దర్యాప్తు**
**పరీక్షల కోసం బయటికి పరుగులు...**
**డాక్టర్ల కోసం గంటల వేచి చూపులు - లిఎంజీఎం లో రోగుల అవస్థలు**
**ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రైవేట్ క్లినిక్‌లకు రోగుల మళ్లింపు?**
**ఎంజీఎం పై తీవ్రమైన ఆరోపణలు**
**పోస్టుమార్టంలో డబ్బుల వేట?**
**ఎంజీఎం ఆసుపత్రి చుట్టూ కలకలం**
**వేలాది రోగులు... కానీ బెడ్లు లేవు, సదుపాయాలు లేవు - ఎంజీఎం దుస్థితి బయటపడింది**
**ఉచిత వైద్యం ఎక్కడ?**
**పరీక్షల కోసం పేదలు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలు**
**ఎంజీఎం ఆసుపత్రి వద్ద అంబులెన్స్ దందా?**
**అత్యవసరంలోనే భారీ చార్జీలు**
**77 మంది డాక్టర్లకు మెమోలు ఇచ్చినా మారని పరిస్థితులు - ఎంజీఎం పై ప్రశ్నలు**
**ఉత్తర తెలంగాణ ప్రజల ఆశ్రయం... కానీ అవినీతి ఆరోపణల ముసుగులో ఎంజీఎం?**
**ఎంజీఎంలోని ప్రతి విభాగముపై ప్రత్యేక కథనాలు అతి త్వరలో**

**వరంగల్ / జై భీమ్ న్యూస్ : (ప్రతినిధి)**

ఉత్తర తెలంగాణ ప్రజలకు ప్రధాన ఆశ్రయం అయిన ఎంజీఎం ఆసుపత్రిలో జరుగుతున్న పరిస్థితులు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. రాష్ట్రంలోనే ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రిగా పేరుగాంచిన ఈ వైద్యసంస్థకు ప్రతిరోజూ వేలాది మంది రోగులు వైద్యం కోసం వస్తుంటారు. ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు పక్కనున్న మహారాష్ట్ర,చత్తీస్గడ్ రాష్ట్రాల నుంచి కూడా అనేక మంది రోగులు ఇక్కడికి చేరుకుంటారు. అయితే పేదలకు ఆశ్రయం కావాల్సిన ఈ ఆసుపత్రిలో వాస్తవ పరిస్థితులు మాత్రం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని రోగులు, వారి బంధువులు చెబుతున్నారు.

**వేలాది రోగులు... కానీ కనీస సదుపాయాలే లేవా?**

ప్రతిరోజూ వేల సంఖ్యలో రోగులు ఈ ఆసుపత్రికి వస్తుంటారు. ఉదయం నుంచే ఆసుపత్రి ప్రాంగణం రోగులతో కిక్కిరిసిపోతుంది. అయితే రోగులు చెబుతున్న వివరాల ప్రకారం ఆసుపత్రిలో కనీస సదుపాయాలు కూడా సరిపోవడం లేదని తెలుస్తోంది. వృద్ధులు, దివ్యాంగులు కూర్చోవడానికి సరైన ఏర్పాట్లు లేక గంటల తరబడి నిల్చోవాల్సిన పరిస్థితి ఉందని రోగులు చెబుతున్నారు. కొన్నిచోట్ల బెడ్లు సరిపోక రోగులు నేలపై పడుకోవాల్సిన పరిస్థితులు కూడా ఉన్నాయని సమాచారం.

**డాక్టర్ల కోసం వేచి చూపులు**



ఆసుపత్రికి వచ్చిన రోగులు డాక్టర్ల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని చెబుతున్నారు. కొంతమంది వైద్యులు సమయానికి విధులకు హాజరు కాకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో పెద్ద జీతాలు తీసుకుంటున్న కొంతమంది వైద్యులు తమ ప్రైవేట్ క్లినిక్‌లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రైవేట్ క్లినిక్‌లకు రోగుల మళ్లింపు?**

రోగుల వాదన ప్రకారం ఆసుపత్రిలో పరీక్షించిన తర్వాత కొందరు వైద్యులు వారిని బయట ఉన్న తమ ప్రైవేట్ క్లినిక్‌లకు రావాలని సూచిస్తున్నారని చెబుతున్నారు. అక్కడ చికిత్స పేరుతో వందల నుంచి వేల రూపాయలు, కొన్ని సందర్భాల్లో లక్షల రూపాయలు కూడా వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉచిత వైద్యం కోసం వచ్చిన పేదవారికి ఇది పెద్ద భారంగా మారుతోంది.

**పరీక్షల కోసం బయటికి పరుగులు**

ఆసుపత్రిలో చేయాల్సిన అనేక పరీక్షలు అక్కడే జరగకపోవడంతో రోగులు బయట ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లకు వెళ్లాల్సి వస్తోందని రోగులు చెబుతున్నారు. రక్తపరీక్షలు, స్కాన్లు, ముఖ్యంగా ఎమ్మారై స్కాన్ వంటి పరీక్షలు ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడం లేదా సమయానికి జరగకపోవడం వల్ల రోగులు బయటికి వెళ్లాల్సి వస్తోంది. ఒక్కో పరీక్షకు వేల రూపాయలు ఖర్చు అవుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలుస్తోంది.

**రోగుల ఆహారంపై కూడా అనుమానాలు**

ఆసుపత్రిలో చేరిన రోగులకు అందించే ఆహారం నాణ్యతపై కూడా అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. రోగులకు అందించే భోజనం సరైన ప్రమాణాల్లో ఉందా అనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది.

**అంబులెన్స్ సేవల్లోనూ ఆరోపణలు**

ఆసుపత్రి వద్ద ప్రైవేట్ అంబులెన్స్ వ్యవస్థపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆక్సిజన్ సదుపాయం లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఘటనలు కూడా బయటకు వచ్చినట్లు సమాచారం.

**గతంలోనే 77 మంది డాక్టర్లకు, సిబ్బందికి మెమోలు**

వైద్యుల, సిబ్బంది నిర్లక్ష్యంపై గతంలో ఒకసారి చర్యలు తీసుకున్న ఘటన కూడా ఉంది. ఒక దశలో 77 మంది డాక్టర్లకు మెమోలు జారీ చేసిన ఘటన ఆసుపత్రిలో చోటుచేసుకున్నట్లు సమాచారం. అయితే ఆ చర్యల తర్వాత కూడా పరిస్థితులు పూర్తిగా మారలేదని స్థానికులు అంటున్నారు.

**ప్రజాప్రతినిధుల ఆందోళన**

స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించినట్లు సమాచారం. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను కోరినట్లు తెలుస్తోంది.

**పోస్టుమార్టం విభాగంలో డబ్బుల వేట**

రోడ్డు ప్రమాదాలు నుండి ఆత్మహత్యలు వరకు చట్టప్రకారం పోస్టుమార్టం తప్పనిసరి. అయితే కొంతమంది సిబ్బంది మృతుల బంధువుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అడిగినంత ఇవ్వకపోతే పోస్టుమార్టం ప్రక్రియను ఆలస్యం చేస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

**అనాథ శవాలపై అక్రమాలు?**

అనాథ శవాల విషయంలో కూడా అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు సిబ్బంది ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు శవాలను ఇవ్వడం పేరుతో రూ.60,000 నుంచి రూ.75,000 వరకు డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఇంకా అనేక ప్రశ్నలు**

ఈ పరిస్థితుల నేపథ్యంలో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి: ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరీక్షలు ఎందుకు జరగడం లేదు. రోగులను ప్రైవేట్ క్లినిక్‌లకు ఎందుకు మళ్లిస్తున్నారు. పోస్టుమార్టం విభాగంలో డబ్బుల వేట నిజమేనా? వేలాది మంది రోగులు వచ్చే ఆసుపత్రిలో కనీస సదుపాయాలు ఎందుకు లేవు?

**ప్రజల డిమాండ్**

ఉత్తర తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల ప్రజలు ఆధారపడే ఈ ఆసుపత్రిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. వైద్యుల హాజరు, పరీక్షల సదుపాయాలు, రోగులకు కనీస సౌకర్యాలు, పారదర్శక పరిపాలన–ఈ అంశాల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిరోజు ఒక్కో విభాగంపై ప్రత్యేక కథనాలతో మీ ముందుకు పూర్తి ఆధారాలతో అతి త్వరలో... జై భీమ్ న్యూస్ ప్రతినిధి శ్రీకాంత్ హన్మకొండ.

# శాంతి భద్రతే సమస్య అయితే, సాధారణ ఎన్నికలు ఎలానిర్వహిస్తున్నారు

**ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే**

**(వరంగల్ జై భీమ్ న్యూస్)**

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఈరోజు కాకతీయ యూనివర్సిటీలోని మానవీయా శాస్త్ర భవనము సెమినార్ హాల్లో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలనే అంశం పైన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ రౌండ్ టేబుల్ జిల్లా అధ్యక్షులు గుర్రం అజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య వక్తలుగా హాజరైన ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే,పి.డి.ఎస్.యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్న రోజుల్లో విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణపై నిషేధం విధించి 38 ఏళ్లు గడుస్తున్నప్పటికీ తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడినప్పటికీ, విద్యార్థి సంఘాలకు ఎన్నికల నిర్వహించడంలో ప్రభుత్వం ఎందుకు స్పష్టత ఇవ్వలేకపోతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు 1988లో ఉస్మానియా విశ్వవిద్యాలయ అనుబంధం నిజాం కళాశాలలో రెండు విద్యార్థి గ్రూపుల మధ్య ఘర్షణలో " దేవేందర్ యాదవ్" అనే విద్యార్థి హత్య జరిగిందనే నేపంతో ఈ ఎన్నికలపై నిషేధం విధించారు. 80వ దశకంలో విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల ఆలోచనలను మెరుగుపరిచి అభివృద్ధివైపు నడిపించాయి. ఆనాటి నుండి నేటి వరకు పాలకులు విద్యార్థి సంఘాల ఎన్నికల ఊసే ఎత్తటం లేదు. విద్యార్థులు,యువత దేశ మొదటి పౌరులుగా చెప్పుకునే మన దేశ పాలకులు భారత రాజ్యాంగంలో ఉన్న హక్కులను సైతం తుంగలో తొక్కుతూ ఈ దేశాన్ని స్వార్థపూరితంగా పాలిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం,విద్యార్థులు యావత్ ప్రజానీకం పోరాటాలను చేసి విద్యార్థులు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న గొప్ప ఘనతగా ఈ సమాజం చూపిస్తుంది. తెలంగాణ ఒక ప్రజాస్వామ్య ఉద్యమాలకు వేదిక విద్య, ఉద్యోగం,ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాట పటిమ ఇక్కడి విద్యార్థి ఉద్యమాలకు ఉంది. ఒకప్పుడు క్యాంపసుల నుండే అనేక మంది విద్యార్థి నాయకులు దేశ రాజకీయాల్లో నాయకులుగా



ఎదిగారు.యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘ నేతలుగా ఎదిగిన అనేకమంది దేశానికి ప్రధానులు, రాష్ట్రపతులు, ఆయా రాష్ట్రాలకు సీఎంలుగా ప్రజలకు సేవలందించారు. ప్రస్తుతం సెంట్రల్ వర్సిటీలు, కొన్ని రాష్ట్ర విశ్వవిద్యా లయాల్లో తప్పితే ప్రభుత్వాలు విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడంలేదు. దీంతో సమాజానికి, దేశానికి నిస్వార్థంగా పనిచేసేందుకు రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తగ్గిపోతున్నారు. అని వారు అన్నారు. 1980-85 మధ్యకాలంలో వివిధ రాష్ట్రాల్లోని విశ్వ విద్యాలయాల్లో జరిగిన కొన్ని హింసాత్మక సంఘటనల వల్ల విద్యార్థి సంఘ ఎన్నికలను ప్రభుత్వాలు రద్దుచేశాయి. తర్వాత సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం మాజీ ఎన్నికల అధికారి జె.ఎం. లింగ్డో అధ్యక్షతన ఒక కమిటీ వేసింది. 2006 సెప్టెంబర్‌లో ఆ కమిటీ ప్రతిపాదించిన రిపోర్టును అమలు చేయాలని యూనివర్సిటీలకు,కాలేజీలకు సుప్రీం కోర్టు సూచించింది. దీంతో కేంద్ర విశ్వవిద్యాలయాలైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లోని వర్సిటీల్లో కొన్నిచోట్ల మాత్రమే విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించకపోవడం దారుణం అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఎన్నికల నుంచి ప్రేరణ, చైతన్యం పొంది రాజకీయాలలోకి వచ్చిన అనేక మంది సాధారణ విద్యార్థులు నేడు భారత పార్లమెంటరీ రాజకీయ వ్యవస్థలో తమ ప్రభావాన్ని చూపుతున్నారు. అయితే విద్యార్థి సంఘ ఎన్నికల జరిగిన కాలంలో విద్యార్థులందరూ సామాజిక స్పృహతో,చైతన్యంగా ఉండేవారు. నాణ్యమైన విద్యాబోధన,కాలేజీ,హాస్టల్ ఫీజులు సామాన్యుడికి కూడా అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వంతో పోరాటం చేసేవారు. విద్యా ప్రయివేటీకరణకు, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు నడిచేవి. ప్రశ్నించేతత్వం ప్రతి విద్యార్థిలో ఉండటంతో విద్యా సంస్థలు బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో పనిచేసేవి. అటు సామాజిక ఉద్యమాల్లోనూ విద్యార్థులు కీలకపాత్ర పోషించేవారు.నేడు విద్యార్థి ఎన్నికలు లేకపోవడంతో వారి డిమాండ్లను లేవనెత్తడం,ఆయా యాజమాన్యాలను, ప్రభుత్వాలను సంప్రదించి,పరిష్కరించడం సవాలుగా మారింది. కొన్నేండ్లుగా తెలంగాణ లో ఉన్న యూనివర్సిటీలు,కళాశాలలకు సరైన నిధుల కేటాయింపులు లేక మౌలిక సదుపాయాలందక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రొఫెసర్ల నియామకాలు లేవు. నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ కూడా అంతే. దీంతో యూనివర్సిటీలలో విద్యాబోధన నిలిచిపోయి పరిశోధనలు కుంటు పడ్డాయి. యూనివర్సిటీల ప్రతిష్ట తుడ్చిపెట్టుకుపోతుంది. విద్యా ప్రయివేటీకర వేగవంతమ వుతున్నది. ఫీజుల దోపిడీ యథేచ్ఛగా సాగుతున్నది. ప్రయివేటు యూనివర్సిటీల ఏర్పాటుకు మొగ్గుచూపు తున్నది. నిరుద్యోగం,కులం,మతం,ప్రాంతాల పేరుతో విద్వేషాలు సృష్టించడం కూడా ఈ పదకొండేండ్ల కాలంలో పరిపాటిగా మారింది. విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేసే అనేక వైపరీత్యాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని హెచ్చరించారు లేని పక్షాన పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమ ఆందోళన చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్,పి.డి.ఎస్.యు పూర్వ జిల్లా అధ్యక్షులు బాలరాజు, భారత్ బచావో రాజ్ మహమ్మద్, టీపీఎఫ్ కుమారస్వామి, పి.డి.ఎస్.యు అనూష,డి,ఎస్,యు శివ, బి.ఎస్.ఎఫ్ బోట్ల మనోహర్, డి.వై.ఎఫ్.ఐ తిరుపతి, డి.ఎస్.ఏ ఠాగూర్, రాకేష్ లో పాల్గొని రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు వంగిటి మోహన్, రమణ, మహేష్, బన్నీ యూనివర్సిటీ నాయకులు రాజేష్,రాంబాబు,వెంకటేష్, సావిత్రి, కళ్యాణి, రెహనా తదితరులు పాల్గొన్నారు. విప్లవాభివందనాలతో మర్రి మహేష్. (పి.డి.ఎస్.యూ )ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి.సెల్ నెంబర్:- 8688128552.

## ఫిట్ ఇండియా-ఒబెసిటీ ఫ్రీ ఇండియా ఉద్యమంలో యువత భాగస్వామ్యం కావాలి

**సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ తాప్సి ఉపాధ్యాయకు కాకతీయ వర్సిటీ వీసీ సన్మానం**



**హన్మకొండ, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

యువత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకొని ఫిట్ ఇండియా -- ఒబెసిటీ ఫ్రీ ఇండియా ఉద్యమంలో భాగస్వాములు కావాలని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఉదయం వీసీ కార్యాలయంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్‌కు చెందిన ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్, మిషన్ హెల్త్ భారత్ వ్యవస్థాపకురాలు, పానీపూరి వాలిగా ప్రసిద్ధి చెందిన తాప్సి ఉపాధ్యాయ (ప్రజల్లో బీటెక్‌గా ప్రసిద్ధి)ను శాలువా, జ్ఞాపికతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న స్థూలకాయం సమస్యను తగ్గించాలనే లక్ష్యంతో తాప్సి ఉపాధ్యాయ చేపట్టిన మిషన్ హెల్త్ భారత్ యాత్ర అభినందనీయమని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఆమె దేశవ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో ఆరోగ్యంపై చైతన్యం కల్పిస్తున్నారని తెలిపారు. రెండు చక్రాల వాహనంపై ప్రయాణిస్తూ ఇప్పటివరకు దేశంలోని 112 నగరాల్లో 220కు పైగా కార్యక్రమాలు నిర్వహించి, దాదాపు లక్ష మందికి పైగా యువతలో ఆరోగ్యకర జీవన విధానం, వ్యాయామం, సరైన ఆహారపు అలవాట్లు మరియు నివారణ చర్యలపై అవగాహన కల్పించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా యువతలో ఓబెసిటీ ముక్త్ జనరేషన్ యొద్ద (ఓఎంజి) అనే భావనతో స్థూలకాయం రహిత సమాజ నిర్మాణం కోసం చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని వీసీ ప్రశంసించారు. ఇటువంటి కార్యక్రమాలు యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించి, ఆరోగ్యవంతమైన భారత నిర్మాణానికి దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా తాప్సి ఉపాధ్యాయతో కలిసి వచ్చిన పరిశోధకులు, విద్యార్థులను కూడా వైస్ చాన్సలర్ అభినందించారు. కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం పాల్గొన్నారు.

## కేయూ గోల్డెన్ జూబిలీ సందర్భంగా ఏడు రోజుల యోగా శిక్షణ కార్యక్రమం

**హన్మకొండ, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబిలీ ఉత్సవాల సందర్భంగా 7 రోజుల యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆచార్య మామిడాల ఇస్తారి తెలిపారు. విశ్వవిద్యాలయం స్టూడెంట్ అఫైర్స్ విభాగం, యోగా సెంటర్ మరియు ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కాలేజీ (కో-ఎడ్యుకేషన్)లో నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 12వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ యోగా శిక్షణ కార్యక్రమం ఏడు రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 4.30 గంటల నుంచి కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమం ప్రారంభోత్సవానికి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని, కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్. రమణ గౌరవ అతిథిగా పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులు మరియు విశ్వవిద్యాలయ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని ఆచార్య మామిడాల ఇస్తారి కోరారు.

## హైదరాబాద్‌లో మహిళా ఎక్సైజ్ సీఐ భర్త ఆత్మహత్య

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌లోని నేరెడ్‌మెంట్‌లో మహిళా ఎక్సైజ్ సీఐ భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సంచలనం రేపింది. భార్య వేధింపులు భరించలేక నగెల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి సూసైడ్ నోట్ రాసి, ఆత్మహత్య చేసుకోవడం అందరినీ కలిచివేస్తోంది. వివరాల్లోకి వెళితే... మంచిర్యాల జిల్లాకు చెందిన శ్రీనివాస్ 2012లో సట్లపల్లి జ్యోతిని వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత ఆమె ఉన్నత చదువులకు, ఉద్యోగ ప్రయత్నాలకు శ్రీనివాస్ పూర్తి స్థాయిలో అండగా నిలిచారు. ఆయన ప్రోత్సాహంతోనే జ్యోతి ఎక్సైజ్ శాఖలో ఎస్సైగా ఎంపికై, ప్రస్తుతం సీఐ స్థాయికి చేరుకున్నారు. అయితే పదవి, హోదా పెరిగిన తర్వాత వారి కాపురంలో కలహాలు మొదలైనట్టు తెలుస్తోంది. సీఐగా ప్రమోషన్ వచ్చిన తర్వాత ఇంటికి రావడం కూడా మానేసిందని సమాచారం. గత నాలుగు నెలలుగా వీరిద్దరూ విడివిడిగా ఉంటున్నారు. జ్యోతి తన పలుకుబడిని ఉపయోగించి శ్రీనివాస్‌పై తప్పుడు వరకట్న వేధింపుల కేసులు పెట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తీవ్ర మనోవేదనకు గురైన శ్రీనివాస్ చివరకు తన చావుకు భార్యే కారణమని సైసైడ్ లెటర్ రాసి రాసి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు శివకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## విచారణకు డుమ్మా కొట్టిన ఐపీఎస్ సునీల్ నాయక్..

**విజయవాడ, జై భీమ్ న్యూస్**

ప్రస్తుత ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును వైసీపీ హయాంలో కస్టోడియల్ టార్చర్ చేసిన కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్... ఏపీ హైకోర్టు ఆదేశించినప్పటికీ నేటి పోలీసు విచారణకు హాజరు కాలేదు. ఈ నెల 9 వరకు విచారణకు హాజరు కావాలని కోర్టు ఇంతకు ముందు ఆదేశించింది. ఆ గడువు ముగియడం, సునీల్ నాయక్ మధ్యంతర బెయిల్ పిటిషన్ అర్హతపై హైకోర్టు వాదనలు వినడం ఆ రోజే జరిగిపోయాయి. అయితే, విచారణాధికారి అభ్యర్థన మేరకు విచారణ గడువును మార్చి 12 (ఈరోజు) వరకు పొడిగిస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు విధించిన గడువులో నేడు ఆఖరి రోజు అయినప్పటికీ, సునీల్ నాయక్ విచారణకు రాకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆయన గైర్హాజరుపై అటు పోలీసు వర్గాల్లో, ఇటు రాజకీయ వర్గాల్లో రకరకాల సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు విచారణకు దూరంగా ఉన్న సునీల్ నాయక్, మరోవైపు న్యాయపోరాటం కొనసాగిస్తున్నారు. ఆయన దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ అర్హత పిటిషన్‌పై నేడు ఏపీ హైకోర్టులో విచారణ జరగనుంది. బెయిల్ పిటిషన్‌పై కోర్టు ఇచ్చే తీర్పు ఎలా ఉండబోతోందనే ఉత్కంఠ సర్వత్ర నెలకొంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

## నెక్లెస్ రోడ్ నీరా కేఫ్‌లో వాణిజ్య దుకాణాల లీజుకు టెండర్లు

బీసీ అభివృద్ధి శాఖ అధికారి




**హన్మకొండ, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్ నగరంలోని నెక్లెస్ రోడ్ వద్ద ఉన్న నీరా కేఫ్ భవనంలో (నీరాస్త్రస్త్ర ప్రోసెసింగ్ యూనిట్, బ్యాంక్వెట్ హాల్) ఏర్పాటు చేసిన ఏడు వాణిజ్య దుకాణాలను లీజుకు ఇవ్వడానికి తెలంగాణ టాడీ టాపర్స్ కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, హైదరాబాద్ మేనేజింగ్ డైరెక్టర్ టెండర్లు ఆహ్వానించినట్లు హనుమకొండ జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఎం. నరసింహ స్వామి తెలిపారు. జిల్లాలో గౌడ వృత్తికి చెందిన సంఘాలకు ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొనే అవకాశం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. జనవరి 2026 నాటికి ఎక్సైజ్ శాఖలో నమోదు చేయబడి క్రియాశీలంగా పనిచేస్తున్న గౌడ వృత్తి సంఘాలు నిర్దిష్ట నిబంధనలు, షరతుల మేరకు టెండర్లలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన గౌడ వృత్తి సంఘాలు ఆన్‌లైన్ ద్వారా తమ బీడ్‌లను దాఖలు చేసుకోవాలని సూచించారు. బీడ్‌ల దాఖలు ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుందని ఆయన తెలిపారు. టెండర్‌కు సంబంధించిన దరఖాస్తు విధానం, నిబంధనలు, ఇతర పూర్తి వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఎం. నరసింహ స్వామి తెలిపారు.

## అంతర్ జిల్లా కరెంట్ మోటార్ల దొంగల ముఠా అరెస్ట్

### రూ.6.60 లక్షల విలువైన 71 మోటార్లు, రెండు వాహనాలు స్వాధీనం



**వరంగల్, 12 మార్చి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వ్యవసాయ బావులు, కాల్వలకు అమర్చిన కరెంట్ మోటార్లను దొంగిలిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను వరంగల్ సీసీఎస్ పోలీసులు కమలాపూర్ పోలీసులతో కలిసి అరెస్ట్ చేశారు. ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.6,60,000 విలువ గల 71 కరెంట్ మోటార్లు, దొంగతనాలకు ఉపయోగించిన ఒక ఆటో ట్రాలీ, ఒక కారు, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అరెస్టైన నిందితులు సిరిగిరి ప్రసాద్ (26) -- తారకరామా కాలనీ, ఓదెల గ్రామం, పెద్దపల్లి జిల్లా; మోతే రాజు (25) -- భగత్ సింగ్ నగర్, చున్నంబట్టి కాలనీ, మంచిర్యాల; టేకు నవీన్ -- ప్రగతి నగర్, ఎన్‌టీపీసీ, గోదావరిఖని; మోటం తిరుపతి -- గాంధీ నగర్, మంచిర్యాల టౌన్; వారణాసి లక్ష్మణ్ (26) -- ఎన్‌టీఆర్ నగర్, మంచిర్యాల; మోటం నరేష్ (25) -- గాంధీ నగర్, మంచిర్యాల; వస్తం భీమేష్ (28) -- భగత్ సింగ్ నగర్, మంచిర్యాల ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. పోలీసుల విచారణలో నిందితులు మద్యం సేవనానికి అలవాటు పడి తమ వ్యక్తిగత ఖర్చుల కోసం సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వ్యవసాయ బావులు, కాల్వలకు అమర్చిన కరెంట్ మోటార్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. రాత్రివేళల్లో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి మోటార్లను విడదీసి వాహనాల్లో తరలించి ఇతర ప్రాంతాల్లో విక్రయించేవారని పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా వరంగల్ కమిషనరేట్ పరిధిలోని కమలాపూర్, దామెర పోలీస్ స్టేషన్ల పరిధిలో 34 మోటార్లు, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని కేశవపట్నం, సైదాపూర్, ఇల్లంతకుంట ప్రాంతాల్లో 36 మోటార్లు, భూపాలపల్లి జిల్లా రేగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మోటార్ దొంగిలించినట్లు తేలింది. ఈ ముఠాకు గతంలో కూడా నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కరీంనగర్, రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్లు దొంగిలించిన కేసుల్లో వీరు అరెస్టై జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, ఏసీపీలు పీ. సదయ్య, ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. వంగపెల్లి క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో నిందితులు ఆటో ట్రాలీ మరియు కారులో వస్తుండగా పోలీసులు అడ్డుకుని పట్టుకున్నారు. అనంతరం నిందితుల ఇచ్చిన సమాచారంతో పరకాల ప్రాంతంలోని ఒక ఇంటిలో దాచిపెట్టిన మరికొన్ని మోటార్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించిన సీసీఎస్ ఇన్స్పెక్టర్లు ఎ. రాఘవేందర్, కె. రామకృష్ణ, కమలాపూర్ ఇన్స్పెక్టర్ నవీన్, ఐటీ కోర్ టీమ్ ఏఏఓ మొహమ్మద్ సల్మాన్ పాషా, ఎస్ఐ శ్రీనివాస రాజు, హెడ్ కానిస్టేబుళ్లు నసీమ్ హమ్మెద్, కె. మహేశ్వర్, వి. జంపయ్య, కానిస్టేబుళ్లు విశ్వేశ్వర్, వంశీ, వినోద్, కమలాపూర్ ఎస్ఐ దిలీప్, సిబ్బందిని సెంట్రల్ జోన్ డీసీపీ అభినందించారు.

# పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలు

### రైతులు తప్పనిసరిగా వేయించాలి: కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్







**హన్మకొండ, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో పశువులను గాలికుంటు (ఫుట్ అండ్ మౌత్) వైరస్ వ్యాధి నుండి రక్షించేందుకు ప్రతి రైతు తమ పశువులకు ఉచితంగా టీకాలు వేయించుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సూచించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. గురువారం హనుమకొండ జిల్లా వడ్డేపల్లి ప్రాథమిక పశువైద్య కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ వైరస్ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం 2019 సంవత్సరం నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి పశువులకు టీకాలు వేయించే కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పశువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. రైతులు తమ పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాలు అధికంగా రావాలనే ఉద్దేశంతో తెలియని ఇంజెక్షన్లు లేదా మందులు ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలని ఆమె హెచ్చరించారు. ఆరోగ్యకరమైన పశువుల ద్వారా స్వచ్ఛమైన పాలను ఉత్పత్తి చేస్తూ పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. టీకాల కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు గోడపత్రికలు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రతి గ్రామంలో గోడలకు గోడపత్రికలను అంటించి, రైతులకు కరపత్రాలను పంపిణీ చేసి టీకాల ప్రాముఖ్యతను వివరించాలని అధికారులకు ఆమె ఆదేశించారు. జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు అధిక జ్వరం రావడం, నోటిలో, కాళ్ల మధ్య పుండ్లు ఏర్పడటం వల్ల పశువులు మేత మేయలేక బలహీనపడతాయని తెలిపారు. దీని కారణంగా పాల దిగుబడి తగ్గి రైతులకు ఆర్థిక నష్టం కలుగుతుందని చెప్పారు. మార్చి 10 నుండి ఏప్రిల్ 9 వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో పశువైద్య సిబ్బంది పశువులకు ఉచితంగా టీకాలు వేస్తారని తెలిపారు. మూడు నెలలు దాటిన ప్రతి పశువుకు ఈ టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు డాక్టర్ సత్య రెడ్డి మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధి, పశు పోషణ, దూడల సంరక్షణ, పాల ఉత్పత్తి పెంపు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ అధికారులు, వడ్డేపల్లి పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఇతర పశువైద్య సిబ్బంది, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శాంతి భద్రతే సమస్య అయితే సాధారణ ఎన్నికలు ఎలా నిర్వహిస్తున్నారు?

### విద్యార్థి సంఘ ఎన్నికలు వెంటనే నిర్వహించాలి: ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే

**వరంగల్, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**



ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలోని మానవీయ శాస్త్ర భవనంలోని సెమినార్ హాల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, అలాగే పి.డి.ఎస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు మాట్లాడుతూ విద్యార్థి సంఘ ఎన్నికలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్న సమయంలో విశ్వవిద్యాలయాలు మరియు కళాశాలల్లో విద్యార్థి సంఘ ఎన్నికలపై నిషేధం విధించి దాదాపు 38 సంవత్సరాలు గడిచిపోయాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఈ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం ఆందోళనకరమని అన్నారు. 1988లో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న నిజాం కళాశాలలో రెండు విద్యార్థి వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో దేవేందర్ యాదవ్ అనే విద్యార్థి హత్యకు గురైన నేపథ్యంలో విద్యార్థి సంఘ ఎన్నికలపై నిషేధం విధించారని గుర్తు చేశారు. అయితే ఆ సంఘటనను కారణంగా చూపుతూ దశాబ్దాలుగా ఎన్నికలు నిర్వహించకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. 1980ల కాలంలో విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందాయని, సామాజిక చైతన్యం విస్తరించిందని తెలిపారు. ఆ కాలంలో క్యాంపసుల నుంచే అనేక మంది విద్యార్థి నాయకులు దేశ రాజకీయాల్లో కీలక స్థానాలకు ఎదిగారని చెప్పారు. యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘ నేతలుగా ఎదిగిన అనేక మంది నాయకులు తర్వాత కాలంలో దేశానికి ప్రధానులు, రాష్ట్రపతులు, ముఖ్యమంత్రులు వంటి పదవులను చేపట్టి ప్రజలకు సేవలందించిన ఉదాహరణలు ఉన్నాయని వివరించారు. 1980--85 మధ్యకాలంలో కొన్ని రాష్ట్రాల్లో జరిగిన హింసాత్మక సంఘటనల కారణంగా విద్యార్థి సంఘ ఎన్నికలు నిలిపివేసినప్పటికీ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ జె.ఎం. లింగ్డో అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 2006 సెప్టెంబర్‌లో ఆ కమిటీ నివేదికను అమలు చేయాలని సుప్రీంకోర్టు సూచించినప్పటికీ తెలంగాణలో ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించకపోవడం విచారకరమని అన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ వంటి కేంద్ర విశ్వవిద్యాలయాలు, కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాం, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లోని కొన్ని విశ్వవిద్యాలయాల్లో మాత్రమే విద్యార్థి సంఘ ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థి సంఘ ఎన్నికలు జరిగే కాలంలో విద్యార్థులు సామాజిక స్పృహతో ఉండేవారని, విద్యా ఫీజులు, హాస్టల్ సమస్యలు, నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వాలను ప్రశ్నించేవారని చెప్పారు. విద్యా ప్రైవేటీకరణ, వ్యాపారీకరణకు వ్యతిరేకంగా విద్యార్థి ఉద్యమాలు బలంగా నడిచేవని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో విశ్వవిద్యాలయాలకు సరైన నిధులు కేటాయించకపోవడం వల్ల మౌలిక సదుపాయాలు క్షీణిస్తున్నాయని తెలిపారు. ప్రొఫెసర్ నియామకాలు లేకపోవడం, నాన్–టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల విద్యా బోధన, పరిశోధనలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీల ప్రతిష్ట దెబ్బతింటోందని, విద్యా ప్రైవేటీకరణ వేగంగా పెరుగుతోందని అన్నారు. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, పూర్వ జిల్లా అధ్యక్షులు బాలరాజు, భారత్ బచావో రాజ్ మహమ్మద్, టీపీఎఫ్ కుమారస్వామి, పి.డి.ఎస్.యు అనూష, డి.ఎస్.యు శివ, బి.ఎస్.ఎఫ్ బోట్ల మనోహర్, డి.వై.ఎఫ్.ఐ తిరుపతి, డి.ఎస్.ఏ ఠాగూర్, రాకేష్ తదితరులు ప్రసంగించారు. అదేవిధంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు వంగిటి మోహన్, రమణ, మహేష్, బన్నీ, యూనివర్సిటీ నాయకులు రాజేష్, రాంబాబు, వెంకటేష్, సావిత్రి, కళ్యాణి, రెహనా తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ నియామకం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిసిన ఎర్రబెల్లి స్వర్ణ





**ఖమ్మం, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఇటీవల నియమితులైన శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ గురువారం ఖమ్మంలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూడా ఆమెతో కలిసి మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎర్రబెల్లి స్వర్ణను మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులైనందుకు అభినందించారు. మహిళల సాధికారత కోసం, మహిళల సమస్యల పరిష్కారానికి ఆమె సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా కాంగ్రెస్ కార్యకలాపాలను మరింత బలోపేతం చేసి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. ఎర్రబెల్లి స్వర్ణ మంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ, తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా కృషి చేస్తానని తెలిపారు. మహిళల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుండేటి నరేందర్, సీనియర్ నాయకులు నల్గొండ రమేష్, తోట హరీష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతర్గత రిజర్వేషన్ అమలును అడ్డుకుంటున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

### మందకృష్ణ మాదిగ ఆరోపణ

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

కర్ణాటక రాష్ట్రంలో అంతర్గత రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయడంలో మీనా మేషాలు చేస్తున్నారూ.కాంగ్రెస్ హైకమాండ్ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మరియు ప్రియాంక గాంధీ. ఈ ముగ్గురిని నియంత్రించేది కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే. ఖర్గే మాల వర్గానికి చెందినవారు. వారు కాంగ్రెస్ హైకమాండ్‌ను అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయడానికి అనుమతించడం లేదు,' అని ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో అంతర్గత రిజర్వేషన్ల అమలు కోసం పోరాడిన నాయకుడు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. అంతర్గత రిజర్వేషన్లను డిమాండ్ చేస్తూ బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో 'అంతర్గత రిజర్వేషన్ పోరాట కమిటీ' నేతృత్వంలో గురువారం జరిగిన భారీ నిరసనలో పాల్గొన్న తర్వాత ఆయన మాట్లాడుతూ, 'కర్ణాటకలోని సిద్ధరామయ్య ప్రభుత్వం అంతర్గత రిజర్వేషన్ల అంశంపై మాల వర్గానికి చెందిన పరమేశ్వర్, మహాదేవప్ప మరియు ప్రియాంక్ ఖర్గేల నిర్ణయం తీసుకున్నారని అన్నారు. "ఈ రోజు నాకు సంతోషంగానూ, విచారంగానూ ఉంది. కర్ణాటకలోని అంతర్గత రిజర్వేషన్ కార్యకర్తలందరూ ఒకే వేదికపైకి వచ్చి, గ్రూపులు మాకు ముఖ్యం కాదని, కానీ సమాజ హక్కులను పొందడం మాకు ముఖ్యమని చెప్పడం ఆనందంగా ఉంది. విచారకరమైన విషయం ఏమిటంటే, ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా, కర్ణాటక ప్రభుత్వం అంతర్గత రిజర్వేషన్లను సరిగ్గా అమలు చేయడం లేదు, "అని ఆయన అన్నారు. "కర్ణాటకలో, మాల సమాజం 15 శాతం రిజర్వేషన్లలో ఎక్కువ భాగాన్ని అనుభవించింది, ఇది కర్ణాటకలో మాత్రమే కాదు, దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో కూడా పరిస్థితి. 1965లో, కేంద్ర ప్రభుత్వానికి చెందిన లోకూర్ కమిటీ షెడ్యూల్డ్ కులాలలో అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలని సిఫార్సు చేసింది, కానీ అప్పటి నుండి, కాంగ్రెస్‌లో మాల సమాజం ఆధిపత్యం కారణంగా, దాని అమలు నిరోధించబడింది, "అని మందకృష్ణ మాదిగ అన్నారు. "1996లో ప్రారంభమైన పోరాటం ఈరోజు మాదిగ రిజర్వేషన్‌ను ఇక్కడికి తీసుకువచ్చింది. మా అంతర్గత రిజర్వేషన్ పోరాటంలో న్యాయం మరియు ధర్మం ఉంది. తెలంగాణలోని అన్ని పార్టీలు మాకు మద్దతు ఇచ్చాయి మరియు తమిళనాడు కూడా అంతర్గత రిజర్వేషన్‌కు అనుకూలంగా ఉందని చెబుతోంది. కర్ణాటకలోని అన్ని పార్టీలు కూడా మా అంతర్గత రిజర్వేషన్‌కు అనుకూలంగా ఉన్నాయని చెబుతున్నాయి. మా పోరాటంలో న్యాయం లేదా ధర్మం లేకపోతే, ఈ పార్టీలన్నీ అంతర్గత రిజర్వేషన్‌ను ఎందుకు అమలు చేయాలని కోరుకున్నాయి?" అని ఆయన ప్రశ్నించారు. అంతర్గత రిజర్వేషన్ మరియు పోరాటం కోసం నినాదాలు ఎక్కువగా వినిపించే రాష్ట్రాల్లోని అన్ని పార్టీలు అంతర్గత రిజర్వేషన్‌కు అనుకూలంగా వైఖరి తీసుకుంటున్నాయి. అన్ని కమిషన్లు అంతర్గత రిజర్వేషన్‌ను అమలు చేయాలని నివేదిస్తున్నాయి," అని ఆయన అన్నారు. "హర్యానాలో ఆగస్టు 2024 తీర్పు తర్వాత జరిగిన క్యాబినెట్ సమావేశంలో అంతర్గత రిజర్వేషన్‌ను అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అంతర్గత రిజర్వేషన్‌ను డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన పోరాటం అనేక ఒడిదుడుకులను చూసింది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అంతర్గత రిజర్వేషన్లను అమలు చేసి ఆదేశించింది, మరియు మాల కులస్థులు అంతర్గత రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2004లో, కేంద్ర ప్రభుత్వం అంతర్గత రిజర్వేషన్లకు అనుకూలంగా అఫిడవిట్ దాఖలు చేయనందున సుప్రీంకోర్టు అంతర్గత రిజర్వేషన్లకు వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. యుపిఎ ప్రభుత్వం అంతర్గత రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నిరంతరం వైఖరిని కొనసాగిస్తున్న సమయంలో, వారు ఉషా మెహ్రా కమిటీతో సహా అనేక కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా అంతర్గత రిజర్వేషన్లను ఇబ్బందుల్లోకి నెట్టారు, "అని ఆయన ఆరోపించారు. "ఆంధ్రలో, 2023లో మాదిగ విశ్వరూపం కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అంతర్గత రిజర్వేషన్లకు అనుకూలంగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఒత్తిడి చేశారు. అదేవిధంగా, నరేంద్ర మోడీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అంతర్గత రిజర్వేషన్లకు అనుకూలంగా అఫిడవిట్ దాఖలు చేసింది. అందుకే సుప్రీంకోర్టు అంతర్గత రిజర్వేషన్లకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేయగలిగింది. రాజీవ్ రంజామిశ్రన్ కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయబడుతున్నాయి. తెలంగాణలో కూడా అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయబడ్డాయి. తమిళనాడు చాలా కాలం క్రితం అరుంధతియార్ సమాజానికి 3శాతం అంతర్గత రిజర్వేషన్లు ఇచ్చింది. "అంతర్గత రిజర్వేషన్లు అన్ని రాష్ట్రాల్లోనూ పరిష్కారమయ్యే స్థాయికి చేరుకున్నాయి. కానీ కర్ణాటకలో అంతర్గత రిజర్వేషన్ల మందగమనం నన్ను చాలా బాధపెట్టింది," అని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. "కర్ణాటకలో, ఎ.జె. సదాశివ కమిటీ అంతర్గత రిజర్వేషన్లకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. మధుస్వామి కమిటీ కూడా అంతర్గత రిజర్వేషన్లకు అనుకూలంగా నివేదిక ఇచ్చింది. ఇదంతా సుప్రీంకోర్టు తీర్పుకు ముందే జరిగితే, సుప్రీంకోర్టు తీర్పు తర్వాత, ఈ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ నాగమోహన్ దాస్ కమిటీ కూడా అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలని నివేదిక ఇచ్చింది. ఎందుకు అమలు చేయడం లేదు?" అని ఆయన ప్రశ్నించారు. "తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణలో, అదే కమిటీ నివేదిక ప్రకారం అంతర్గత రిజర్వేషన్లు అమలు చేయబడ్డాయి. కానీ కర్ణాటకలోని 3 కమిటీల నివేదికలు ఉన్నప్పటికీ, కర్ణాటకలోని కాంగ్రెస్ పార్టీ అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్గత రిజర్వేషన్లకు అనుకూలంగా ఉందని ప్రకటించినప్పటికీ, కాంగ్రెస్ పార్టీలో మాదిగలకు మాల కమ్యూనిటీకి ఉన్నంత ప్రాధాన్యత లేదని ఇది చూపిస్తుంది. నేడు, కర్ణాటకలోని కాంగ్రెస్ పార్టీ మాల కమ్యూనిటీ ప్రభావానికి భయపడుతోంది. కానీ వారు మాదిగ సమాజం యొక్క కోపం మరియు బాధను అర్థం చేసుకోలేరు, "అని ఆయన అన్నారు.







# మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్





**హన్మకొండ, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" అవగాహన సదస్సుకు హాజరైన మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో భోజనం చేశారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై గ్రామీణ, పట్టణ ప్రజాప్రతినిధులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లాలోని గ్రామాల సర్పంచులు, పరకాల మున్సిపాలిటీ కౌన్సిలర్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు హాజరయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తొలి సెషన్ నిర్వహించగా, అనంతరం అధికారులు కలెక్టరేట్ ప్రాంగణంలో భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మహిళా సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లతో కలిసి నిలుచుని భోజనం చేశారు. అదనపు కలెక్టర్ రవి సహా ఇతర అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళా ప్రజాప్రతినిధులతో కలెక్టర్ స్నేహపూర్వకంగా మమేకమై మాట్లాడి వారితో కలిసి భోజనం చేయడం పట్ల మహిళా సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలి - అంబేద్కర్ రాజు




**యాదవ్ నగర్ / జై భీమ్ న్యూస్ :**

జిల్లా అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణపై గ్రామీణ, పట్టణ ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించే కార్యక్రమం హనుమకొండలోని యాదవ్ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అంబేద్కర్ రాజు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చేలా రూపొందించబడిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేయడం ఈ కార్యాచరణ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనులు సమయానికి పూర్తవ్వాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ 99 రోజుల కార్యాచరణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకుని తమ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడితే ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై చర్చించారు.

# తెలంగాణలో ఒంటిపూట బడులు

### ఈ నెల 15 నుంచి కొత్త వేళలు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పనివేళల్లో మార్పులు చేసింది. ఈ నెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఒంటిపూట బడులు (హాఫ్‌డే స్కూల్స్) నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఇవాళ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాల ప్రకారం ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు ఒంటిపూట విధానంలోనే నడుస్తాయి. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్స్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మాత్రమే పనిచేస్తాయి. తరగతులు ముగిసిన వెంటనే మధ్యాహ్నం 12:30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. అయితే, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు యథావిధిగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే, పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలలు పరీక్షలు జరిగే రోజుల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుంది. మిగతా రోజుల్లో ఈ కేంద్రాలు కూడా సాధారణ హాఫ్‌డే టైమింగ్స్‌ను పాటిస్తాయి.

# గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలి: మంత్రి కొండా సురేఖ

### ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక విజయవంతానికి అందరూ భాగస్వాములు కావాలి

**వరంగల్ జిల్లా/గీసుగొండ, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**






గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాదని, గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసి భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ జిల్లాలోని గీసుగొండ మండలం మరియాపురం గ్రామంలోని ఎస్.ఎస్. ఫంక్షన్ హాల్‌లో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికపై జిల్లాలోని ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు వందేమాతరం, జయ జయహే తెలంగాణ గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం మార్చి 6 నుండి జూన్ 12 వరకు అమలు చేస్తున్న 99 రోజుల ప్రత్యేక కార్యాచరణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సర్పంచ్ నుండి మంత్రి వరకు ప్రతి ప్రజాప్రతినిధి స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతకు అనుగుణంగా అధికారులు పనిచేస్తూ సంక్షేమ పథకాలు, ప్రజా సేవలను వేగంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను క్లియర్ చేయడం, గ్రామాలు మరియు పట్టణాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభతరం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ పనితీరుకు ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ 99 రోజుల ప్రణాళిక ద్వారా పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం సరఫరా వంటి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వం కల్పించిన అవకాశాలను వినియోగించుకుని క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో పారిశుధ్యం అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. పరిశుభ్రత కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ గ్రామాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. పరిశుభ్రత ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని, ప్రజల ఆరోగ్య రక్షణలో శానిటేషన్ ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు గ్రామాలు, పట్టణాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రిస్తూ పర్యావరణానికి హాని కలిగించని ప్రత్యామ్నాయాలను ఉపయోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం అవసరమని తెలిపారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మరియు ప్రకృతి విపత్తులను తగ్గించడంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామపంచాయతీలు అవసరమైన మొక్కల కోసం ఇండెంట్ పంపితే సంబంధిత శాఖ ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. అభివృద్ధికి ఆదర్శంగా నిలిచిన గ్రామాలను సందర్శించి అక్కడ అమలు చేసిన విధానాలను తెలుసుకుంటే ప్రజాప్రతినిధులకు పరిపాలనలో ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి సూచించారు. శిక్షణలో నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టి ప్రజల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. పదవులు శాశ్వతం కావని, కానీ ప్రజలకు చేసిన సేవలు మాత్రం చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా వినూత్న సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా 10 అంశాలపై 99 రోజులపాటు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ప్రజాప్రతినిధులకు వివరించారు. గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం గుర్తించిన 10 కీలక అంశాలపై ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఐదు దశల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 2న గ్రామ స్థాయి గ్రామ సభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి కార్యక్రమాలు, మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలు, మే 22న జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించి, జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముందు ఇటీవల మరణించిన గంగదేవిపల్లి మాజీ సర్పంచ్ కూసం రాజమౌళికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి చేతుల మీదుగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు మరియు ప్రజాప్రతినిధులకు ఐడెంటిటీ కార్డులు అందజేశారు. అనంతరం డీఆర్‌డీఏ, ఉద్యానవన శాఖ, స్వయం సహాయక సంఘాలు, పునరుత్పాదక ఇంధన శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి ప్రారంభించి పరిశీలించారు. వివిధ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను కూడా మంత్రి, మేయర్, కలెక్టర్ కలిసి తిలకించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట, నర్సంపేట చైర్‌పర్సన్లు సారంగపాణి, పెండ్యాల లక్ష్మీ, డీసీపీ అంకిత్ కుమార్, డీఎఫ్ఓ అనుజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వై.వి. గణేష్, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, డిపిఓ కల్పనతో పాటు జిల్లాలోని సర్పంచులు, కౌన్సిలర్లు, జీడబ్ల్యూఎంసీ పరిధిలోని కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# పనులు పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణే లక్ష్యం

బొక్కలగడ్డలో రోడ్డు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

శంకుస్థాపనలు చేసి ఊరుకునే నాయకుడు కాదని, పనులు పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తూ అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయించడమే తన ధ్యేయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మరోసారి నిరూపించారు. మాటల కాలం ముగిసిందని, చేతలతో పనితనం చూపిస్తూ ప్రజలకు మన్నికైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందుతున్నారు. ఇటీవల వరంగల్ నగరంలోని 6వ డివిజన్ పరిధిలోని బొక్కలగడ్డ ప్రాంతంలో అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు, గురువారం ఉదయం అక్కడే పర్యటించి పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా, వేసిన రోడ్లపై వాటర్ క్యూరింగ్ జరుగుతుందా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా వంటి అంశాలను ఆయన దగ్గరుండి పరిశీలించారు. పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు, కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ప్రజల డబ్బుతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడే విధంగా మౌలిక సదుపాయాలను కల్పించాలనే ఉద్దేశంతో పనులను పర్యవేక్షిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజలకు మన్నికైన రహదారులు, మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే తమ లక్ష్యమని, అభివృద్ధి పనులను పారదర్శకంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, బీసీ సెల్ చైర్మన్ బొమ్మతి క్రాంతి, డివిజన్ అధ్యక్షుడు శివాజీ, సీనియర్ నాయకులు బాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

# వాణిజ్య సంస్థలపై ఆకస్మిక దాడులు

60 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం





**హన్మకొండ, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు గురువారం హన్మకొండ నగరంలోని పలువురు వాణిజ్య సంస్థలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగిస్తున్న 60 గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల సమయంలో కొంతమంది వ్యాపారులు గృహ వినియోగానికి కేటాయించిన ఎల్పీజీ సిలిండర్లను హోటళ్లు, వాణిజ్య సంస్థల్లో ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి, అత్యవసర వస్తువుల చట్టం (ఎషెన్సియల్ కామడిటీస్ యాక్ట్ ) లోని సెక్షన్ 6ఏ కింద చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గృహ వినియోగానికి మాత్రమే కేటాయించిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించడం చట్ట విరుద్ధమని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలను అరికట్టేందుకు భవిష్యత్తులో కూడా నిరంతరంగా ఆకస్మిక దాడులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ టీం సభ్యులు డీటీ భద్రునాయక్, వేణుగోపాల్, సదానందం పాల్గొన్నారు.

# తెలంగాణలో గ్యాస్ కొరత లేదు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో డొమెస్టిక్ గ్యాస్ కొరత లేదని, కేవలం వాణిజ్య సిలిండర్ల కొరత మాత్రమే ఉందని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సూర్యాపేటలో 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గ్యాస్ కొరతపై శుక్రవారం చమురు రంగ కంపెనీలతో సమీక్షిస్తామని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా గ్యాస్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. గ్యాస్ సిలిండర్ల విషయంలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీలర్లు బ్లాక్ మార్కెటింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్యాస్ సరఫరాపై ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. ప్రజలు గ్యాస్ కొరతతో ఇబ్బందిపడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మరో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఇద్దరు కేంద్రమంత్రులు, ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా మన రాష్ట్రానికి కావాల్సిన గ్యాస్‌ను తీసుకురావడం లేదని విమర్శించారు. మున్ముందు ఎరువుల కొరత కూడా ఏర్పడే అవకాశముందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ చర్యలు తీసుకుంటోందని అన్నారు.

# మాదకద్రవ్యాల నివారణకు ప్రహరి

కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

**హన్మకొండ, 12 మార్చి 2026 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవనశైలిని అలవాటు చేయించడం లక్ష్యంగా హనుమకొండ జిల్లాలో ప్రహరి క్లబ్బులపై జిల్లా స్థాయి ఒకరోజు అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. పాఠశాలల్లో మాదకద్రవ్యాల ప్రమాదాలపై చైతన్యం కల్పించడం, విద్యార్థులకు సరైన దిశానిర్దేశం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి హాజరై మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదకరమైన సామాజిక సమస్యగా మారుతున్నదని అన్నారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాల స్థాయిలోనే విద్యార్థులకు సరైన అవగాహన కల్పించడం ద్వారా ఈ సమస్యను నివారించవచ్చని తెలిపారు. ప్రహరి క్లబ్బుల ద్వారా విద్యార్థులు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన పొందడమే కాకుండా తమ సహచర విద్యార్థులను కూడా జాగృతం చేయగలరని చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి విద్యతో పాటు మంచి విలువలు కూడా అవసరమని పేర్కొన్నారు. ప్రహరి క్లబ్బులు విద్యార్థుల్లో బాధ్యతాభావాన్ని పెంపొందించడంతో పాటు మాదకద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా ప్రేరేపిస్తాయని తెలిపారు. హనుమకొండ ఏఎంఓ మన్మోహన్, మండల ఎంఈఓ నెహ్రూ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు కలిసి పనిచేస్తే మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చని సూచించారు. యువత తమ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ ప్రహరి క్లబ్బుల ప్రాముఖ్యతను వివరిస్తూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, సామాజిక దుష్పరిణామాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర అవగాహన కల్పించారు. విద్యార్థులు కూడా ఆసక్తిగా పాల్గొని పలు ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ ఈ. సుమాదేవి ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మాదకద్రవ్యాలపై చైతన్యం పెంపొందడంతో పాటు సమాజంలో మంచి మార్పు తీసుకురావడంలో ప్రహరి క్లబ్బులు కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు తెలిపారు.




# కేయూలో ఘనంగా ఇఫ్తార్ విందు

సోదరభావాన్ని పెంపొందించే పవిత్ర కాలం రంజాన్: వీసీ ప్రతాప్ రెడ్డి




**హన్మకొండ, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

పరస్పర సోదరభావాన్ని పెంపొందించే పవిత్ర కాలం రంజాన్ నెల అని కే. ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. కాకతీయ యూనివర్సిటీ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం విశ్వవిద్యాలయ అతిథి గృహంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ మొహమ్మద్ ఆసిమ్ ఇక్బాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం త్యాగానికి, సేవాభావానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. ఉపవాసం ద్వారా సహనం, కరుణ, సమానత్వం వంటి విలువలను జీవితాల్లో ఆచరించుకోవాలని రంజాన్ పండుగ మనకు సందేశం ఇస్తుందని తెలిపారు. ఈ పవిత్ర నెలలో పరస్పర ప్రేమ, ఐక్యత, సోదరభావం పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయాల చైర్మన్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ రంజాన్ పండుగ సోదరభావాన్ని పెంపొందించే గొప్ప పండుగ అని అన్నారు. బీదలు, పేదలకు సహాయం చేయడం ద్వారా సమాజంలో సర్వమానవాళి సంక్షేమం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రపంచంలో శాంతి, సమృద్ధి కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ చిర్రా రాజు, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల, క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్, మొహమ్మద్ ఇక్బాల్ అలీ, బోటనీ విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య మహమ్మద్ ముస్తఫా తదితరులతో పాటు పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తిరుపతి దర్శనం పేరిట విశ్రాంత ఉద్యోగిని మోసం చేసిన పూజారి

తిరుపతి టిక్కెట్లు బుక్ చేస్తానని ఫోన్ తీసుకుని రూ.18.46 లక్షలు బదిలీ చేసుకున్న పూజారి




**(గంగాధర జై భీమ్ న్యూస్)**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఓద్యారం గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి ప్రతి రోజు దర్శనానికి వెళ్తున్న ఒక విశ్రాంత ఉద్యోగితో పరిచయం ఏర్పరచుకున్న సాయి తరుణ్ అనే ఆలయ పూజారి. తిరుపతి దర్శనం, ట్రైన్ టిక్కెట్లు బుక్ చేస్తానని బాధితుడి ఫోన్ తీసుకుని, పాస్వర్డ్ తెలుసుకుని, మేసేజీలు రాకుండా చేసిన సాయి తరుణ్. తిరుపతి దర్శనం టికెట్ల పేరుతో ప్రతిరోజూ ఫోన్ తీసుకుని, బాధితుడి ఖాతా నుండి 30 విడతల్లో రూ.18.46 లక్షల రూపాయలను దామెర హరీష్ అనే వ్యక్తికి పంపిన పూజారి. డబ్బులు అవసరమయ్యి బ్యాంకుకు వెళ్లగా, అకౌంట్లో డబ్బులు లేవని అధికారులు చెప్పడంతో స్టేట్మెంట్ తీసి చూడగా, రోజు ఉదయం 9 గంటల లోపు రూ.99,999 బదిలీ అయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించిన బాధితుడు. హరీష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, పరారీలో ఉన్న పూజారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేస్తున్న పోలీసులు.

# సిఈఐఆర్ పోర్టల్ సహాయంతో 109 మొబైల్ ఫోన్ల రికవరీ

బాధితులకు అందజేసిన సిద్దిపేట పోలీసులు: సీపీ రష్మీ పెరుమాళ్





**సిద్దిపేట, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి పొందేందుకు కేంద్ర ప్రభుత్వ సిఈఐఆర్ పోర్టల్ ఎంతో ఉపయోగకరంగా పనిచేస్తోందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు సిద్దిపేట పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సిఈఐఆర్ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించి మొత్తం 109 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. స్వాధీనం చేసుకున్న ఈ మొబైల్ ఫోన్ల మొత్తం విలువ సుమారు పది లక్షల రూపాయలు ఉంటుందని అధికారులు తెలిపారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మొబైల్ ఫోన్లను బాధితులకు సీపీ రష్మీ పెరుమాళ్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు ప్రజలు ఆందోళన చెందకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే ఞఞఞ.ఎవఱతీ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేస్తే పోగొట్టుకున్న ఫోన్లను సులభంగా గుర్తించి తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు చాలా మంది నిర్లక్ష్యం చేస్తారని, కానీ ఫోన్‌లో వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగ్ వివరాలు వంటి కీలకమైన సమాచారం ఉండే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను త్వరితగతిన గుర్తించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో మొత్తం 200 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు సీపీ వెల్లడించారు. సిఈఐఆర్ పోర్టల్ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఎవరికైనా మొబైల్ ఫోన్లు దొరికితే వాటిని సంబంధిత పోలీస్ స్టేషన్‌కు అందజేయాలని లేదా ఆ నంబర్‌కు కాల్ చేసి యజమానికి తిరిగి ఇవ్వాలని ఆమె సూచించారు. సాంకేతికతను వినియోగించి మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన సిఈఐఆర్ బృందాన్ని ఈ సందర్భంగా సీపీ అభినందించారు. ముఖ్యంగా ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, కానిస్టేబుల్ పి. రమేష్‌లను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, ట్రైనీ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా, సిద్దిపేట ఏసీపీ రవీందర్, గజ్వేల్ ఏసీపీ నర్సింలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తమ మొబైల్ ఫోన్లు తిరిగి దొరికినందుకు బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ సీపీ రష్మీ పెరుమాళ్ మరియు సిద్దిపేట పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించిన టి డబ్ల్యూ జేఎఫ్ విజిలెన్స్ కమిటీ

ఊకల్ గ్రామంలో ఓదెల ఐలమ్మ మరణంపై ప్రగాఢ సానుభూతి వ్యక్తం.




**మార్చి 12 జైభీమ్ ప్రతినిది: (వరంగల్ /గీసుకొండ)**

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఊకల్ గ్రామానికి చెందిన మహాత్మ జ్యోతిరావు పూలే విద్యాసంస్థ ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య తల్లి కీర్తిశేషులు ఓదెల ఐలమ్మ ఇటీవల మరణించడంతో, వారి కుటుంబాన్ని టి డబ్ల్యూ జేఎఫ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా టి డబ్ల్యూ జేఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఈసీ సభ్యుడు జన్ను శ్రీనివాస్ బాబు, అనగారిన కులాల తెలంగాణ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడుగుల రాంబాబు, ఉమ్మడి వరంగల్ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు వాసం సాంబయ్యలు ఓదెల మల్లయ్య నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరణించిన ఓదెల ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ వారికి మనోధైర్యాన్ని అందించారు.అంతేకాకుండా ఐలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు.

## రెండో పెళ్లికి ఒప్పుకోలేదని భార్యపై భర్త కర్కశం.. రోడ్డుపై పడేసి దాడి

కాకినాడ జిల్లా సామర్లకోటలో వెలుగుచూసిన ఘటన
బాధితురాలు ఎక్సైజ్ కానిస్టేబుల్
పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య.. కేసు నమోదు



**కాకినాడ, జై భీమ్ న్యూస్**

రెండో పెళ్లి చేసుకునేందుకు అంగీకరించలేదన్న కోపంతో ఓ భర్త కట్టుకున్న భార్యపై అమానుషంగా ప్రవర్తించాడు. నడిరోడ్డుపై ఆమెను కిందపడేసి విచక్షణారహితంగా కొట్టాడు. ఈ దారుణ ఘటన కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పీ వేమవరంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పీ వేమవరానికి చెందిన మణికంఠ, దేవి 2021లో ప్రేమ వివాహం చేసుకున్నారు. దేవి ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. అయితే, తన మేనకోడలిని రెండో పెళ్లి చేసుకోవాలని మణికంఠ నిర్ణయించుకున్నాడు. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో తాజాగా మరోసారి వాగ్వాదం జరగడంతో మణికంఠ కోపంతో ఊగిపోయాడు. భార్య దేవిని రోడ్డుపై కిందపడేసి దారుణంగా కొట్టాడు. భర్త వేధింపులు భరించలేకపోయిన ఆమె, తనకు న్యాయం చేయాలంటూ సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చైతన్యంతోనే వినియోగదారుల మోసాలను అరికట్టవచ్చు

ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పిలుపు

**హన్మకొండ, 12 మార్చి 2026 (జై భీమ్ న్యూస్)**



వినియోగదారులు చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే మోసపూరిత వ్యాపారాలను అరికట్టగలమని హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయ్ పేర్కొన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధ్యక్షుడు డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ రచించిన లి"వినియోగదారుల హక్కుల చైతన్య కరపత్రిక"లిను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ గత నాలుగు దశాబ్దాలుగా వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. సమాజంలో వినియోగదారులు ఎదుర్కొనే మోసాలు, కల్తీ ఉత్పత్తులు, తప్పుడు ప్రకటనలు, ఆన్లైన్ కొనుగోళ్లలో జరిగే మోసాల నుంచి ప్రజలు ఎలా రక్షించుకోవాలో ఈ కరపత్రంలో సవివరంగా వివరించారని చెప్పారు. ప్రత్యేకంగా వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం – – 2009లో ఉన్న నిబంధనల గురించి ఇందులో వివరించారని తెలిపారు. తప్పుడు లేదా మోసపూరిత ప్రకటనలు చేస్తే వాటిలో పాల్గొనే సెలబ్రిటీలకు కూడా జరిమానా లేదా జైలు శిక్ష విధించే నిబంధనలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. వినియోగదారులు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకొని చట్టపరమైన మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు. ఇక 78 సంవత్సరాల వయసులో కూడా డాక్టర్ రతన్ సింగ్ ఠాకూర్ సమాజంలో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందించడం ప్రశంసనీయమని కలెక్టర్ అభినందించారు. ప్రతి వినియోగదారుడు చట్టంపై అవగాహన పెంపొందించుకొని తన హక్కులను కాపాడుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వరంగల్ జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి, స్టేట్ కన్స్యూమర్ క్లబ్స్ కోఆర్డినేటర్ కొడిమాల శ్రీనివాసరావు, విజిలెన్స్ కమిటీ సభ్యుడు బండ కాళిదాస్, కన్స్యూమర్ కార్యకర్త డాక్టర్ జగదీష్ ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా డా. వన్నాల వెంకటరమణ నియామకం

రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును కలిసి కృతజ్ఞతలు తెలిపిన వెంకటరమణ.
పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడి

**మార్చి 12 జైభీమ్ ప్రతినిది (వరంగల్ /వర్ధన్నపేట)**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా డా. వన్నాల వెంకటరమణను నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం ఈ నెల 12వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని ప్రకటించారు. ఈ సందర్భంగా డా. వన్నాల వెంకటరమణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఆయన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సేవలందించారు. తన సేవలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు, రాష్ట్ర నాయకత్వానికి, జాతీయ బీజేపీ నాయకత్వానికి వెంకటరమణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డా. వన్నాల వెంకటరమణ బాల్యం నుంచే స్వయంసేవక్‌గా సేవలందిస్తున్నారు. మహేశ్వరం నర్సంపేటలోని శ్రీ గురుకుల విద్యాలయంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యాభ్యాసం చేశారు. విద్యార్థి దశలో ఆర్ఎస్ఎస్ శిబిరాల్లో చురుకుగా పాల్గొన్నారు. వెంకటరమణ తండ్రి వన్నాల శ్రీరాములు మాజీ ఎమ్మెల్యేగా పనిచేయడంతో పాటు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగానూ సేవలందించారు. జనసంఘ్ కాలం నుంచి బీజేపీలో కొనసాగుతూ ఒకసారి వర్ధన్నపేట ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారు. వృత్తిరీత్యా డాక్టర్ అయిన వెంకటరమణ ఎం.డి.ఎస్., పీహెచ్‌డీ దంతవైద్య నిపుణులుగా ప్రొఫెసర్‌గా దేశ విదేశాల్లో సేవలందించారు. అదేవిధంగా గత 20 సంవత్సరాలుగా వాక్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సుమారు 500 కుటుంబాలకు ప్రతి నెల 10 కిలోల సన్నబియ్యం అందజేయడంతో పాటు తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లల విద్యాభ్యాసానికి పాఠశాల, కళాశాల ఫీజులు చెల్లిస్తూ పుస్తకాలు, నోట్‌బుక్స్, పరీక్షా సామగ్రిని అందజేస్తూ పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రజలతో పాటు వరంగల్ జిల్లా ప్రజలతో మమేకమై బీజేపీ కార్యకర్తలు, నాయకులతో కలిసి పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని డా. వన్నాల వెంకటరమణ ఈ సందర్భంగా తెలిపారు.



## పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



**హన్మకొండ, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

ఈ నెల 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుండి డీఈఓ ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ భువనేశ్వరిలతో కలిసి పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలకు 12,079 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఇందుకోసం 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి కేంద్రంలో 64 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 64 మంది డిపార్ట్మెంటల్ అధికారులు, 64 మంది సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు వంటి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. కేంద్రాల సూపరింటెండెంట్లు ఈ సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. పరీక్ష హాల్స్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద బాలురు, బాలికలకు వేరువేరుగా ఫ్రిస్కింగ్ (తనిఖీలు) నిర్వహించాలని, పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు పూర్తిగా సిద్ధంగా ఉండాలని, నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పరీక్షలను నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఏఎన్ఎంలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ బస్సు సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా అత్యంత కట్టుదిట్టంగా పరీక్షలను నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మరణంలో కూడా విడదీయరాని స్నేహం..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

**మరిపెడ, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**



మహబూబాబాద్ జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. చిన్ననాటి నుంచి విడదీయరాని స్నేహితులుగా కలిసి పెరిగిన ఇద్దరు యువకులు ఒకే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం స్థానికులను కలిచివేసింది. మరణంలో కూడా ఒకరినొకరు విడిచిపెట్టకుండా హత్తుకుని ఉండటం చూసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. మరిపెడ మండలం లచ్య తండా పరిధిలోని ఎన్‌హెచ్‌–365 జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, ఉదయ్ కిరణ్ (21), భిక్షం (22) అనే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ నుంచి మరిపెడ వైపు ప్రయాణిస్తున్నారు. చిన్ననాటి నుంచి కలిసి చదువుకుని, కలిసి తిరిగే ప్రాణ స్నేహితులుగా వీరు గ్రామంలో అందరికీ సుపరిచితులు. ఈ క్రమంలో మార్గమధ్యంలో వేగంగా వస్తున్న గుర్తుతెలియని వాహనం వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రంగా ఉండటంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదానికి కారణమైన వాహనం మాత్రం ఆగకుండా అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ప్రమాదం అనంతరం సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు చూసిన దృశ్యం హృదయ విదారకంగా మారింది. మృతదేహాలను పరిశీలించిన సమయంలో ఇద్దరూ ఒకరినొకరు హత్తుకుని ఉన్నట్లు కనిపించడం అక్కడున్న వారిని తీవ్రంగా కలిచివేసింది. ఈ ఘటనతో రెండు కుటుంబాలు మాత్రమే కాకుండా గ్రామమంతా విషాదంలో మునిగిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే మరిపెడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ విషాద ఘటనతో ప్రాంతంలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది.

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమం

మహిళల భద్రత, ట్రాఫిక్ నియమాలపై కీలక సూచనలు







**గీసుగొండ, 12 మార్చి 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్.ఎస్. ఫంక్షన్ హాల్‌లో కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని భావించి వారికి చట్టాలు, భద్రతా చర్యలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్, వరంగల్ జిల్లా కలెక్టర్, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను తెలుసుకొని సమర్థవంతంగా పరిష్కరించడంలో ముందుండాలని సూచించారు. సమాజంలో శాంతి భద్రతలు నెలకొల్పడంలో, మహిళల రక్షణలో మరియు ప్రజలలో చట్టాలపై అవగాహన పెంపొందించడంలో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ అధికారులు మహిళల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా షీ టీమ్స్ పాత్ర, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ నివారణ, మహిళలపై వేధింపులు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించడం వంటి విషయాలను వివరించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ సేవల గురించి కూడా తెలియజేశారు. అదేవిధంగా ట్రాఫిక్ విభాగం అధికారులు రోడ్డు భద్రతపై కీలక సూచనలు ఇచ్చారు. ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించడం, హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సుమారు 700 మంది సర్పంచులు, కౌన్సిలర్లు మరియు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని వివిధ అంశాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమం వరంగల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

## 10 మంది ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్..


పార్టీ ఫిరాయింపు కేసును ముగించిన సుప్రీంకోర్టు
తెలంగాణలో ఉత్కంఠ రేపిన పార్టీ ఫిరాయింపుల వ్యవహారం
అన్ని పిటిషన్లను స్పీకర్ పరిష్కరించారన్న న్యాయవాది అభిషేక్ సింఘ్వీ
స్పీకర్ నిర్ణయం నేపథ్యంలో విచారణ ముగిసిందని ప్రకటించిన సుప్రీంకోర్టు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇప్పటికే ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ఫిరాయింపులపై దాఖలైన మొత్తం 10 పిటిషన్లను స్పీకర్ ఇప్పటికే పరిష్కరించారని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ధర్మాసనానికి వివరించారు. సదరు 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ తేల్చిచెప్పినట్లు ఆయన తెలిపారు. సింఘ్వీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను రెండు రోజుల్లోగా ఫిర్యాదుదారులకు అందజేయాలని ఆదేశించింది. స్పీకర్ తన నిర్ణయాన్ని వెలువరించిన నేపథ్యంలో, ఈ పిటిషన్లపై విచారణ ముగిసినట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది.

# బట్టుపల్లి ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో కలకలం

**విద్యార్థినిపై అసభ్య ప్రవర్తన ఆరోపణలు**
**డాన్స్ మాస్టర్‌పై పోక్సో కేసు**






**కాజీపేట, 12 మార్చి 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలోని బట్టుపల్లి ప్రాంతంలో ఉన్న ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో చదువుతున్న 5వ తరగతి విద్యార్థినిపై డాన్స్ మాస్టర్ అసభ్యంగా ప్రవర్తించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై బాధిత బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల సమాచారం ప్రకారం, తేదీ 12-03-2026 ఉదయం సుమారు 11 గంటల సమయంలో బట్టుపల్లిలోని ఎస్ఆర్ కాలేజ్ ప్రాంగణంలో డాన్స్ మాస్టర్‌గా పనిచేస్తున్న కొమ్ముల కపిల్ అనే వ్యక్తి డాన్స్ ప్రాక్టీస్ సందర్భంగా 5వ తరగతి చదువుతున్న బాలికపై అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాలికతో అనుచితంగా ప్రవర్తిస్తూ చేతులతో ఆమె ప్రైవేట్ భాగాలను తాకినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనతో తీవ్ర ఆందోళనకు గురైన బాలిక ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులకు వివరించింది. వెంటనే స్పందించిన తల్లి సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు డాన్స్ మాస్టర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన వెలుగులోకి రావడంతో స్కూల్ యాజమాన్యం ఆ డాన్స్ టీచర్‌ను విధుల నుంచి తొలగించినట్లు సమాచారం. అయితే ఈ సంఘటనతో స్కూల్ భద్రతా వ్యవస్థపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా డాన్స్ క్లాస్ నిర్వహించే ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం, అలాగే బాలికల డాన్స్ ప్రాక్టీస్ సమయంలో మరో ఉపాధ్యాయుడు లేదా వార్డెన్ పర్యవేక్షణ లేకుండా డాన్స్ టీచర్‌కు పిల్లలను అప్పగించడం వంటి అంశాలు తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మాట్లాడేందుకు స్కూల్ యాజమాన్యం ఉదయం 9.30 గంటలకు రావాలని చెప్పడంతో బాలిక తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లారు. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత మూడు గంటల పాటు వేచి ఉన్నప్పటికీ డాన్స్ టీచర్ హాజరుకాలేదని, సరైన సమాధానం కూడా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఆగ్రహానికి గురిచేసిన అంశం ఏమిటంటే, డాన్స్ టీచర్ చేసిన తప్పుకు స్కూల్ యాజమాన్యానికి సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అధిక ఫీజులు చెల్లించి కార్పొరేట్ స్కూల్‌లో పిల్లలను చేర్పించినప్పటికీ కనీస భద్రత కూడా లేకపోవడం పట్ల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సుబేదారి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. రంజిత్ కుమార్ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో స్కూల్‌లలో బాలికల భద్రతపై మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు మరియు స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# వైకల్యాన్ని జయించిన క్రికెటర్‌కు పోలీస్ అండ

**ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ గౌడ్ ఆర్థిక సహాయం**

**రేగొండ, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**



ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించడంలో పోలీసు అధికారులు ఎప్పుడూ ముందుంటారని రేగొండ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) గుర్రం కృష్ణ ప్రసాద్ గౌడ్ మరోసారి నిరూపించారు. పెద్దంపల్లి గ్రామానికి చెందిన మూగ క్రికెటర్ పసుల రాజు ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న ఆయన మానవత్వంతో ముందుకు వచ్చి తక్షణ సహాయంగా రూ.5,000 నగదును అందజేశారు. పసుల రాజు చిన్ననాటి నుంచే మాట్లాడలేని వైకల్యంతో బాధపడుతున్నప్పటికీ, క్రికెట్ పట్ల ఉన్న అపారమైన ఆసక్తి మరియు కృషితో క్రీడారంగంలో తన ప్రతిభను చాటుకుంటున్నారు. శారీరక వైకల్యం ఉన్నప్పటికీ దాన్ని అడ్డంకిగా భావించకుండా కష్టపడి సాధన చేస్తూ జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ కనబరుస్తున్నారు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండటంతో క్రీడా సామాగ్రి కొనుగోలు చేయడం, పోటీలకు వెళ్లడం వంటి ఖర్చులను భరించడం ఆయనకు కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న రేగొండ ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ గౌడ్ వెంటనే స్పందించి క్రీడాకారుడికి ప్రోత్సాహంగా రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. పోలీస్ విధుల్లో బిజీగా ఉన్నప్పటికీ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రతిభావంతులైన యువతను ప్రోత్సహించడం ప్రశంసనీయమని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై చేసిన ఈ సహాయం పట్ల పసుల రాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత కష్టపడి సాధన చేసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించాలని రాజుకు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ గౌడ్ ఆకాంక్షించారు. ఎస్సై చూపిన ఈ మానవతా భావం స్థానిక ప్రజల్లో మంచి స్పందన పొందడంతో పాటు, ప్రతిభ ఉన్న కానీ ఆర్థికంగా వెనుకబడిన క్రీడాకారులకు ఇది ప్రేరణగా నిలుస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో 2,500 కిలోల కల్తీ పెరుగు స్వాధీనం

**పోలీసులు, టాస్క్‌ఫోర్స్, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ**
**ఈ పెరుగును హోటళ్లు, ఫంక్షన్లకు తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

గత కొన్నిరోజులుగా కల్తీ నెయ్యి గురించి మనం వార్తలు వింటున్నాం. ఇటీవల హైదరాబాద్‌లో పెద్ద మొత్తంలో కల్తీ నెయ్యి పట్టుబడింది. తాజాగా, అధికారులు కల్తీ పెరుగును కూడా పట్టుకున్నారు. హైదరాబాద్ నగరంలోని అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో 2,500 కిలోల కల్తీ పెరుగును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పాలలో కాస్టిక్ సోడాను వినియోగించి ఈ కల్తీ పెరుగును తయారు చేస్తున్నట్లు తనిఖీల్లో అధికారులు గుర్తించారు. అంబర్‌పేట పోలీసులు, ఖైరతాబాద్ టాస్క్‌ఫోర్స్, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు కలిసి తనిఖీలు చేపట్టారు. శాంపిళ్లను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. వేడి పాలలో కాస్టిక్ సోడాను వేస్తే అది పెరుగుగా మారుతుంది. ఈ పెరుగును తింటే అనారోగ్యానికి గురవుతారని సంబంధిత అధికారులు వెల్లడించారు. కల్తీ పెరుగు గురించి సమాచారం రాగానే అధికారులు గోడౌన్‌పై దాడి చేశారు. ఈ పెరుగును వివిధ హోటళ్లు, ఫంక్షన్‌లకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు.

# డైట్ వరంగల్‌లో ఎఫ్ఎల్ఎన్-ఏఎక్స్ఎల్ ఏఐ శిక్షణ కార్యక్రమం



**వరంగల్, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో పఠన, గణిత నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)- అసిస్టెడ్ లాంగ్వేజ్ అండ్ మాథ్స్ లెర్నింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఎక్స్ఎల్ ఏఐ) కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని డైట్ వరంగల్‌లో గురువారం నిర్వహించారు. ఈ శిక్షణలో జిల్లాలో ఎంపికైన 11 పాఠశాలల నుండి 50 శాతం మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఉండ్రాతి సుజన్ తేజ మాట్లాడుతూ, విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయిలోనే పఠన, అర్థగ్రహణ మరియు గణిత నైపుణ్యాలను అభివృద్ధి చేయడం అత్యంత కీలకమని తెలిపారు. చిన్న తరగతుల నుంచే పిల్లలు సరిగ్గా చదవడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను సాధిస్తే వారి భవిష్యత్ విద్యాభ్యాసానికి బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నిపుణ్ భారత్ మిషన్ లక్ష్యాలను సాధించడానికి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా మూడో తరగతి పూర్తయ్యే సమయానికి ప్రతి విద్యార్థి సులభంగా చదవగలగడం, అర్థం చేసుకోవడం, అలాగే ప్రాథమిక గణిత సమస్యలను పరిష్కరించగలగడం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్--ఏఎక్స్ఎల్ ఏఐ కార్యక్రమం ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పద్ధతులను ఉపయోగించి ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని అంచనా వేయడం సాధ్యమవుతుందని చెప్పారు. దీని ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల బలహీనతలను సులభంగా గుర్తించి వారికి తగిన విధంగా బోధన అందించగలరని వివరించారు. తరగతి గదిలో ఆక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, ప్లే వే మెథడ్, చైల్డ్ సెంటర్డ్ టీచింగ్ విధానాలను విస్తృతంగా అమలు చేయాలని ఆయన సూచించారు. విద్యార్థుల్లో చదవు అలవాటు పెంపొందించేందుకు ప్రతిరోజూ రీడింగ్ ప్రాక్టీస్ నిర్వహించడంతో పాటు గణిత నైపుణ్యాలను పెంపొందించేందుకు చిన్న చిన్న కార్యకలాపాలు చేపట్టాలని అన్నారు. విద్యార్థుల అభ్యాస పురోగతిని అంచనా వేయడానికి బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన చోట రెమెడియల్ టీచింగ్ చేపట్టాలని సూచించారు. అలాగే 3వ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో చదవడం, రాయడం మరియు గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందేలా కంప్యూటర్ ఆధారిత బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్‌గా రాయపురెడ్డి, గంగాధర్, పద్మజ, సౌజన్య, నరేందర్ పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కేయూ జిమ్నాస్టిక్స్ మహిళల జట్టు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



**హన్మకొండ, 12 మార్చి 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయం మహిళల జిమ్నాస్టిక్స్ జట్టు 2025--2026 విద్యాసంవత్సరానికి నిర్వహించనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ జిమ్నాస్టిక్స్ పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలు మార్చి 14 నుండి 16 వరకు చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరుగనున్నాయి. ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ విభాగంలో కాకతీయ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, హనుమకొండకు చెందిన జి. అనుష, బి. ప్రత్యూష, కె. స్రావణి మరియు కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ టెక్నాలజీ (క్యూసెట్), వరంగల్‌కు చెందిన జె. శ్రావణి ఎంపికయ్యారు. రిథ్మిక్ జిమ్నాస్టిక్స్ విభాగంలో కాకతీయ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, హనుమకొండకు చెందిన బి. అంజలి ఎంపికైంది. ఈ మహిళల జట్టుకు వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు చెందిన ఫిజికల్ డైరెక్టర్ యు. రవీందర్ కోచ్-కమ్-మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారిణులను కాకతీయ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ వై. వెంకయ్య అభినందించి, జాతీయ స్థాయి పోటీల్లో విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# జర్నలిస్టులకు క్యాష్‌లెస్ వైద్యం కల్పించాలి: సీఎస్‌కు టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే వినతి



**హైద్రాబాద్, మార్చి 12 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో జర్నలిస్టులకు కూడా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత (క్యాష్‌లెస్) వైద్యం అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) ప్రతినిధులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావును కోరారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత దృష్ట్యా బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని వారు విజ్ఞప్తి చేశారు. గురువారం సెక్రటేరియట్‌లో సీఎస్ రామకృష్ణారావును టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి. రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, హెచ్‌యూజే అధ్యక్షుడు బి. అరుణ్ కుమార్, కార్యదర్శి బి. జగదీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి బి. రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ బయ్యా దామోదర్, జాయింట్ సెక్రటరీ క్రాంతి తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేస్తున్న 'హెల్త్ కేర్ ట్రస్ట్' పరిధిలోకి జర్నలిస్టులను కూడా చేర్చాలని కోరారు. అలాగే జర్నలిస్టులకు ఉచిత వైద్య సేవలు అందేలా చేయడంతో పాటు, ఇందుకు అవసరమైన ప్రీమియంను ప్రభుత్వమే బీమా సంస్థలకు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సరైన వైద్యం అందక, ఆర్థిక ఇబ్బందులతో జర్నలిస్టుల కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రతినిధులు సీఎస్‌కు వివరించారు. జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌పై సంఘాలతో త్వరలోనే ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరగా, ఈ విషయంపై సీఎం దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని సీఎస్ రామకృష్ణారావు హామీ ఇచ్చారు.

# ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్యే : మంత్రి సీతక్క

**మాతృభాషను గౌరవిస్తూనే ఇతర భాషల జ్ఞానం పొందాలి**
**దిశా ఫౌండేషన్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి**



**ములుగు, మార్చి 12 (జై భీమ్ న్యూస్):**

ప్రపంచాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య మాత్రమేనని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. మాతృభాషను గౌరవిస్తూనే ఇతర భాషలపై కూడా పట్టు సాధించాలని ఆమె విద్యార్థులకు సూచించారు. గురువారం ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈసీఐఎల్, దిశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లెర్న్ టు రీడ్ ఆంగ్ల భాష పరిజ్ఞాన కార్యక్రమంలో మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ములుగు జిల్లా అభివృద్ధిలో స్వచ్ఛందంగా భాగస్వామ్యం అవుతున్న ఈసీఐఎల్, దిశా ఫౌండేషన్ సంస్థలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల సౌకర్యాలు లేని దట్టమైన అటవీ ప్రాంతంలో ఈసీఐఎల్ ఆర్థిక సహకారంతో కంటైనర్ స్కూల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. నెల్సన్ మండేలా చెప్పినట్లుగా ప్రపంచాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య మాత్రమేనని పేర్కొంటూ, ఒక వ్యక్తి సంపాదించిన విద్యా జ్ఞానాన్ని ఎవరూ దోచుకోలేరని తెలిపారు. దిశా ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న "లెర్న్ టు రీడ్" కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆంగ్ల భాషపై అవగాహన పెంపొందించుకునే మంచి అవకాశం లభిస్తుందని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ తరగతులు ప్రారంభించడం ద్వారా విద్యకు పునాది వేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ పిల్లలకు కూడా యూనిఫామ్‌లు అందజేస్తున్నామని మంత్రి తెలిపారు. విద్యకు వయసుతో సంబంధం లేదని, జ్ఞానానికి అంతం ఉండదని, తాను ఇప్పటికీ ఒక విద్యార్థిలా కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉన్నానని అన్నారు. మాతృభాషను గౌరవిస్తూ, ఇతర భాషలు ముఖ్యంగా ఇంగ్లీష్, హిందీ నేర్చుకోవడం అవసరమని, బయటి ప్రపంచంలో భాష ఒక అడ్డంకిగా మారకూడదని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నప్పటి నుంచి నాకు సినిమాలంటే చాలా ఇష్టం: రేవంత్ రెడ్డి

**హైటెక్ సిటీలో నెట్‌ఫ్లిక్స్ కార్యాలయాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి**
**హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ రావడం అంటే సాక్షాత్తు హాలీవుడ్ ఇక్కడికి వచ్చినట్టే అన్న సీఎం**
**నెట్‌ఫ్లిక్స్‌కు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్‌ను గ్లోబల్ కంటెంట్ హబ్‌గా మార్చే దిశగా మరో భారీ అడుగు పడింది. ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ తన 'ఐలైన్ స్టూడియోస్' గ్లోబల్ విజువల్ ఎఫెక్ట్స్, వర్చువల్ ప్రొడక్షన్ హబ్‌ను హైటెక్ సిటీలో ప్రారంభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ... హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ రావడం అంటే సాక్షాత్తు హాలీవుడ్ ఇక్కడికి వచ్చినట్లే అని అన్నారు. నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి పనిచేయాలనే తన కల నేడు నిజమైందని సంతోషం వ్యక్తం చేశారు. నెట్‌ఫ్లిక్స్ సంస్థకు ఇది ఇండియాలో రెండో కార్యాలయం అని చెప్పారు. ఫోర్త్ సిటీగా పిలుస్తున్న 'ఫ్యూచర్ సిటీ'లో నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కార్యాలయం ఏర్పాటుకు కావాల్సిన భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని... ఈ సంస్థకు తమ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. తెలంగాణ అంటేనే బిజినెస్ అని, ఇక్కడ పెట్టుబడులకు పూర్తి రక్షణ ఉంటుందని భరోసా ఇచ్చారు. తనకు చిన్నప్పటి నుంచి సినిమాలు అంటే చాలా ఇష్టమని ముఖ్యమంత్రి తెలిపారు. తన చిన్నప్పటి బ్లాక్ అండ్ వైట్ టీవీలు, వీసీఆర్‌ల నుంచి నేడు 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్', 'కల్కి' వంటి అంతర్జాతీయ స్థాయి సినిమాల వరకు వచ్చిన మార్పులను సీఎం గుర్తుచేసుకున్నారు. చెన్నై నుంచి టాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తెచ్చిన ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, హీరో రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ప్రతినిధులు, పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

జై భీమ్ POWER OF PEOPLE

# తన భార్యపై ప్రశంసలు కురిపించిన అల్లు శిరీష్

ప్రియురాలు నయనికను పెళ్లాడిన అల్లు శిరీష్
నయనిక తన కుటుంబ సభ్యులతో త్వరగా కలిసిపోయిందన్న శిరీష్
బన్నీ అన్న పనులను దగ్గరుండి పర్యవేక్షించాడని వెల్లడి



టాలీవుడ్ హీరో అల్లు శిరీష్ తన వివాహం తర్వాత జీవితంలో చోటుచేసుకున్న మార్పులను, వేడుక విశేషాలను పంచుకున్నాడు. తన ప్రియురాలు నయనికను పెళ్లాడిన శిరీష్... వివాహానంతరం ఇచ్చిన మొదటి ఇంటర్వ్యూలో తన భార్యపై ప్రశంసల వర్షం కురిపించాడు. నయనిక చాలా తెలివైనదని, తన కుటుంబ సభ్యులతో చాలా త్వరగా కలిసిపోయిందని సంతోషం వ్యక్తం చేశాడు. గతంలో ఎక్కడికి వెళ్లినా తన ఒక్కడికే ఖర్చు పెట్టుకునేవాడినని, ఇప్పుడు ఇద్దరి బిల్లులు కట్టాల్సి ఉంటుందని సరదాగా వ్యాఖ్యానించాడు. పెళ్లి వేడుకలో తన సోదరుడు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పోషించిన పాత్ర గురించి శిరీష్ ప్రత్యేకంగా ప్రస్తావించాడు. ఇంత పెద్ద వేడుకలో చిన్నపాటి పొరపాట్లు జరగడం సహజమని, వాటిని పట్టించుకోకుండా ప్రతి క్షణాన్ని పూర్తిగా ఆస్వాదించాలని బన్నీ ఇచ్చిన సలహా తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని చెప్పారు. అల్లు అర్జున్ స్వయంగా పెళ్లి పనులన్నీ దగ్గరుండి పర్యవేక్షించాడని, వేడుక ముగిసే వరకు అక్కడే ఉండి అన్ని బాధ్యతలు నెరవేర్చాడని శిరీష్ గుర్తు చేసుకున్నాడు. అంతేకాకుండా, టాలీవుడ్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల వివాహం కూడా తన పెళ్లికి కొన్ని రోజుల ముందే జరిగిందని... విజయ్ సొంత పనుల ఒత్తిడిలో ఉండి కూడా తన వివాహ వేడుకకు హాజరై తన స్నేహాన్ని చాటుకున్నారని తెలిపాడు.

# తన తల్లి పాత ఆడియో క్లిప్‌ను బయటకు తీసి, వివాదం సృష్టిస్తున్న వారిపై రష్మిక ఫైర్

వ్యక్తిగత దాడులను ఎనిమిదేళ్లుగా భరించానన్న రష్మిక
24 గంటల్లో ఆడియో క్లిప్ తొలగించాలంటూ వార్నింగ్
వాటిని తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరిక

నటి రష్మిక మందన్న తన వ్యక్తిగత జీవితంపై జరుగుతున్న అసత్య ప్రచారాల పట్ల అత్యంత కఠినమైన నిర్ణయం తీసుకున్నారు. నటుడు విజయ్ దేవరకొండతో వివాహం జరిగిన కొద్ది రోజులకే, ఎనిమిదేళ్ల క్రితం నాటి తన తల్లి ఆడియో క్లిప్‌ను కావాలనే బయటకు తీసి వివాదం సృష్టించడంపై ఆమె తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గత ఎనిమిదేళ్లుగా తనపై జరుగుతున్న వ్యక్తిగత దాడులను మౌనంగా భరించానని, అయితే ఇప్పుడు తన కుటుంబాన్ని కూడా ఇందులోకి లాగడం అన్ని హద్దులను దాటడమేనని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరి అనుమతి లేకుండా ప్రైవేట్ సంభాషణలను రికార్డ్ చేయడం, అందులోని కొంత భాగాన్ని మాత్రమే వాడుకుని తప్పుడు అర్థాలు వచ్చేలా ప్రచారం చేయడం తన ప్రైవసీకి భంగం కలిగించడమేనని రష్మిక స్పష్టం చేశారు. వ్యూస్ కోసం ఒకరి గౌరవాన్ని తాకట్టు పెట్టే ధోరణిని ఇకపై సహించేది లేదని హెచ్చరించారు. తప్పుడు వార్తలు, ఆ ఆడియో క్లిప్‌ను ప్రచారం చేస్తున్న వారికి ఆమె 24 గంటల సమయాన్ని నిర్దేశించారు. ఈ గడువులోగా వాటిని తొలగించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని సంబంధిత వ్యక్తులకు, మీడియా సంస్థలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. రష్మిక తీసుకున్న ఈ నిర్ణయం పట్ల సోషల్ మీడియాలో భారీ మద్దతు లభిస్తోంది. సినీ తారల వ్యక్తిగత జీవితాలను సాకుగా చూపి వేధింపులకు గురిచేసే ధోరణికి అడ్డుకట్ట వేయాలని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కొత్త జీవితాన్ని ప్రారంభించిన శుభ సమయంలో ఇలాంటి వివాదాలు సృష్టించడం అమానుషమని పలువురు సినీ ప్రముఖులు కూడా ఆమెకు మద్దతుగా నిలుస్తున్నారు. 2016లో కన్నడ సినిమా 'కిరిక్ పార్టీ' సినిమా సమయంలో రష్మిక, కన్నడ నటుడు రక్షిత్ శెట్టి ప్రేమలో పడ్డారు. 2017లో వీరు నిశ్చితార్థం చేసుకున్నారు. అయితే 2018లో వారు విడిపోయారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఆడియోలో.. ఆ సమయంలో రష్మిక ఎదుర్కొన్న వేధింపుల గురించి ఆమె తల్లి మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు ఎనిమిదేళ్ల క్రితం నాటి ఈ సంభాషణను, ఇప్పుడు తన పెళ్లి జరిగిన శుభసమయంలో కావాలనే బయటపెట్టడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



# నేడు కేయుకు తీన్మార్ మల్లన్న రాక

విద్యాపరమైన సమస్యలపై సుదీర్ఘ చర్చ జరగనుందా?
పార్ట్ టైం అధ్యాపకుల కన్నీరు తుడిచేది ఎప్పుడు
తూతూ మంత్రంగా సమావేశం జరగనుందా....
ఈ చర్చా వేదిక ద్వారా విశ్వవిద్యాలయానికి లాభం జరగనుందా....
గత 20 సంవత్సరాలుగా కేయూ ఆస్తులను,భూములను కబ్జా చేస్తున్న కబ్జాదారులకు శిక్ష పడేనా
నిజాయితీ కలిగిన ఆచార్యులు, అధికారులు, విద్యార్థులపై మానసిక భౌతిక దాడులేంది.
గతంలోని పర్యటనలను తలపిస్తుందా ప్రత్యేకతను సంతరించుకుంటుందా?
విద్యార్థులపై కేసులు పెట్టే హక్కు అవినీతి అక్రమార్కులకు ఉందా!
కాంగ్రెస్ పాలనలో కూడా కేయూలో ఆర్ఎస్ఎస్ అధికార ఆగడాలు ఏంది?
కేయూలో అవినీతి దోపిడీకి హద్దులు లేకుండా పోతున్నాయి
విశ్వవిద్యాలయాన్ని రక్షిస్తారా ?మూసివేస్తారా?

**కాకతీయ విశ్వవిద్యాలయము 13 జై భీమ్ న్యూస్ :**

కాకతీయ విశ్వవిద్యాలయం ఏర్పడి 50 సంవత్సరాలు అవుతుండగా విశ్వవిద్యాలయం మానుగడ దినదినానికి దిగజారి పోతుందని విద్యార్థులు మేధావులు భావిస్తున్నారు విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఉన్నతమైన విద్యను ఉన్నతమైన పరిశోధనను అందించుట కొరకు కాకతీయ యూనివర్సిటీ అనేది 1976లో ఏర్పడినది ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయం సమస్యల సుడిగుండంలో మునిగి తేలుతుంది అవినీతి అక్రమార్కులు భూకబ్జాలు క్షేత్రస్థాయిలో పెరిగిపోతున్నాయని సంవత్సరాల కాలం పాటుగా విశ్వవిద్యాలయంలో నిర్మాణాత్మకమైన చర్చలు,పోరాటాలు ఉద్యమాలు జరుగుతూనేవున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా స్థానికేతరులైన వీసీలు యూనివర్సిటీని పాలించడం వల్ల స్థానికులైన ఆచార్య ,అధికారులు విసీలపై అజమాయిషి చెలాయిస్తూ పరిపాలన విధివిధానాలను వారి కబంధహస్తాలకు తీసుకోవడం జరిగిందని దానివల్ల మాత్రమే పరిపాలన కుంటుపడి విశ్వవిద్యాలయం వెనుకబాటుతనానికి చేరువైందని భావించాల్సి ఉంది.అనాది కాలం నుండి నేటి వరకు అవినీతి అక్రమాలు ప్రసాదిస్తున్న ఆచార్య, ఆధ్యాపకులే అత్యధిక పదవులలో కొనసాగుతూ విశ్వవిద్యాలయ భవిష్యత్తును భ్రష్టు పట్టిస్తుండడమే కాకుండా కులాల ప్రాతిపదికన అధికార పదవులను పంచుకుంటూ విద్యా అవినీతి సామ్రాజ్యాలను స్థాపించి పెంపొందించుకుంటూ విశ్వవిద్యాలయ అధికార పదవులు వాళ్లకే శాశ్వతం అనే విధంగా పరిపాలనను కొనసాగిస్తుండడం ఉద్యమాల ఊపిరి గడ్డైన కాకతీయ విశ్వవిద్యాలయం అన్ని విధాల వెనుకబడిపోతుంది.

**కాకతీయ యూనివర్సిటీలో పేరుకుపోతున్న సమస్యలు**

1) 10 సంవత్సరాల అనుభవంతో 16 పీరియడ్స్ వర్క్ లోడ్ తో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులను జీవో నెంబర్ 11 ఆధారంగా తక్షణమే కాంట్రాక్టు అధ్యాపకులుగా పరిగణించాలి.

2) విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేటు కళాశాలల అనుమతులలో జరుగుతున్న గత15 సం సంవత్సరాల విచారణ నివేదికలను కేయూ వెబ్సైట్లో పొందుపరచాలి.

3) పరీక్షల నియంత్రణ విభాగాన్ని ప్రైవేటుపరం నుండి తొలగిస్తూ.... అవినీతి అక్రమార్కుల నుండి కాపాడాలి.

4) కాకతీయ యూనివర్సిటీలోని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చబడాలి .

5) 2021 సంవత్సరంలో పెంచబడిన విద్యా కోర్సుల ఫీజులు, పరిశోధన ఫీజులు పూర్తిగా తగ్గించబడాలి.

6) అన్ని కోర్సుల విద్యార్థిని విద్యార్థులకు బేదాభిప్రాయాలు లేకుండా హాస్టల్ వసతి కల్పించాలి.

7) పరిపాలన పరమైన అంశాలలో తీసుకోబడిన నిర్ణయాలను విశ్వవిద్యాలయ అధికారిక వెబ్సైట్లో పొందుపరచాలి.

8) విద్యార్థులపై అవినీతికి పాల్పడుతున్న అధికారులు క్రిమినల్ కేసులు పెట్టే పద్ధతులు పూర్తిగా నిర్మూలించబడాలి.

9) కేయూలో అవినీతి అధికారులను కాపాడడం కోసము స్థానిక పోలీసులు కనపరుస్తున్న సహకారాన్ని పూర్తిగా నిర్మూలించాలి.

10) అవినీతికి పాల్పడుతున్న అధికారులను ఎట్టి పరిస్థితుల్లో అధికారిక పదవులలో కొనసాగించకూడదు.

11) ఆర్ఎస్ఎస్ భావజాలంను పెంచి పోషిస్తు, అసాంఘిక కార్యకలాపాలను పాలు పడుతున్న వ్యక్తుల ఆగడాలను పూర్తిగా అరికట్టాలి.

12) కేయూ భూకబ్జాదారులపై పీడి ఆక్ట్ లాంటి చర్యలను చేపట్టాలి.

13) సెమినార్లకు సమావేశాలకు విద్యార్థిని విద్యార్థుల పోగు చేయుట తరగతులను బహిష్కరించకూడదు.

14) విశ్వవిద్యాలయాన్ని రక్షించడానికి నిజాయితీగా ఉన్న ఆచార్యులను, ఉద్యమకారులను, విద్యార్థి మేధావులను, జర్నలిస్టులను అణిచి వేయడానికి కుట్రలు పన్నుతున్న పాలకవర్గం ఆగడాలకు చరమగీతం పాడాలి.

15) మహిళలపై విద్యార్థినీలపై పెరుగుతున్న మానసిక సెక్సువల్ అరాస్మెంట్ దాడులు పూర్తిగా నిర్మూలించబడాలి.

16) కేయూలో పనిచేసిన ఆచార్య అధ్యాపకుల ఆస్తుల వివరాలను విశ్వవిద్యాలయ వెబ్సైట్లో పొందుపరచాలి.

17) అవినీతి అధికారులపై వేయబడిన కమిటీలు ప్రభుత్వాల పేరు చెబుతూ దాటి వేయడం కాకుండా విశ్వవిద్యాలయంలోనే చర్యలు తీసుకోవాలి.

18) అవినీతికి పాల్పడుతున్న అధికారులను పదవులలో కొనసాగించకూడదు.

19) ప్రభుత్వము మంజూరు చేసిన ఉత్తర్వుల ప్రకారము 32 మంది ఆశావాకులకు సూపర్ న్యూమరరి కోటాలో పిహెచ్డి అడ్మిషన్లు కల్పించాలి.

20) కేయూలో గత 12 సంవత్సరాల పరిపాలనలో ఆదాయం, ఖర్చులు,

మిగులుబాటు ఆధారాలను స్టేట్ ఆడిట్, విజిలెన్స్ అధికారులచే విచారణ జరిపించి అట్టి ఆధారాలను విశ్వవిద్యాలయ వెబ్సైట్లో పొందుపరచాలి.

21) పరిపాలన విధానంలో ప్రభుత్వ యూనివర్సిటీ నియమాలకు విరుద్ధంగా అధికార దుర్వినియోగానికి పాల్పడిన అవినీతి అక్రమార్కులైన అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి.

22) ఇప్పటి వరకు జరిగిన 156 పాలకమండలి సమావేశాల ఎజెండాను మినిట్స్ ని తోపాటు ప్రతి అంశంపై నిర్ణయించిన పరిష్కార ఆమోదాలను అధికారిక వెబ్సైట్లో పొందుపరిచి నిజాయితీ కనపరచాలి.

23) 2005 సంవత్సరానికి సంబంధించిన సమాచార హక్కు చట్టం వినతి పత్రాలకు భేషరతుగా ఆధారాలు ఇవ్వాలి.

24) 2019 నుండి 2026 సంవత్సరం వరకు హాస్టల్ పరిపాలన ఆధారాలపై విశ్వవిద్యాలయం శ్వేత పత్రం విడుదల చేయాలి.

25) సామాజిక కోణాలను పెద్దపీట వేసి అవినీతి పరులపై చర్యలు చేపట్టాలి.

26) క్రిమినల్ కేసులు జైలు జీవితాలు అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారిక ఆచార్యును శాశ్వతంగా ఉద్యోగం నుండి తొలగించాలి.

పైనపేర్కొనబడిన సమస్యలతో విశ్వవిద్యాలయంలో నెలకొల్పబడిన ప్రతి సమస్యపై పరిష్కారం కోసం ఆచార్యులు, మేధావి వర్గము, విద్యార్థులు ప్రజలు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తూ ఉన్నారు. మరిన్ని ప్రత్యేక కథనాలతో అతి త్వరలో మీ ముందుకు రాబోతున్నాము.

జై భీమ్ న్యూస్ ప్రతినిధి హన్మకొండ శ్రీకాంత్.



# తన పేరులో తండ్రి పేరును తొలగించిన హీరో విజయ్ కుమారుడు

తమిళ స్టార్ విజయ్ కుటుంబంలో మరో కీలక పరిణామం
తండ్రి పేరును తొలగించి తల్లి పేరును చేర్చుకున్న కుమారుడు జాసన్ సంజయ్
ఇప్పటికే సోషల్ మీడియాలో తండ్రిని అన్‌ఫాలో చేసిన జాసన్

తమిళ స్టార్ హీరో, టీవీకే పార్టీ అధినేత విజయ్ వ్యక్తిగత జీవితం ఇప్పుడు కోలీవుడ్‌లో, తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. రాజకీయాల్లో బిజీ అవుతున్న తరుణంలోనే ఆయన కుటుంబంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ముఖ్యంగా విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడిగా తన అరంగేట్ర చిత్రం 'సిగ్మా' పనుల్లో బిజీగా ఉన్న జాసన్ సంజయ్... తన తండ్రి విజయ్ పేరును తన పేరు పక్కన నుంచి తొలగించాడు. తాజా సమాచారం ప్రకారం, తన పేరులో తన తండ్రి అక్షరం 'ఎ'ని తొలగించి... 'ఝుంశీఅ ాఖుఅయిుఎ ాా' గా మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ 'హ' అంటే తన తల్లి సంగీత పేరును సూచిస్తుంది. గతంలోనే సోషల్ మీడియాలో తండ్రిని అన్‌ఫాలో చేసిన జాసన్, ఇప్పుడు ఏకంగా తండ్రి పేరునే పక్కన పెట్టడం గమనార్హం. మరోవైపు,



విజయ్ భార్య సంగీత విడాకుల కోసం చెంగలపట్టు ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించడం తమిళనాట కలకలం రేపింది. విజయ్ ఒక నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని, అది తనను మానసిక వేదనకు గురిచేసిందని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ విషయంలో పిల్లలు ఇద్దరూ (జాసన్ సంజయ్, దివ్య సాషా) తల్లికే మద్దతుగా నిలిచినట్లు సమాచారం. తనతో పాటు పిల్లల పోషణ కోసం భృతి చెల్లించాలని, అలాగే తమ నివాసం విషయంలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని ఆమె కోర్టును కోరారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టి 2026 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న విజయ్‌కు, ఈ కుటుంబ కలహాలు, విడాకుల వ్యవహారం పెద్ద సవాలుగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం జాసన్ సంజయ్ తన తల్లికి అండగా ఉంటూనే, తన సినీ కెరీర్‌ను విజయ్‌తో సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM